'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 13 | గురువారం | 27.08.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 13 | Thursday | 27.08.2026 | Pages: 8 | Rate: 2

## 28 నుంచి ఇందిరమ్మ ఇళ్ల లాటరీ



హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకం కింద నిర్మించనున్న ఇళ్ల కేటాయింపునకు లాటరీ ప్రక్రియ ఈ నెల 28 నుంచి 31 వరకు నిర్వహించనున్నారు. నాలుగు రోజుల పాటు రోజుకు నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల చొప్పున మొత్తం 16 నియోజకవర్గాలకు లాటరీ నిర్వహించనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతమ్ తెలిపారు. లాటరీ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఎలాంటి అనుమానాలు, అపోహలకు తావు లేకుండా డ్రా చేపడతామని స్పష్టం చేశారు. స్థలాభావం, భద్రతా కారణాలతో దరఖాస్తుదారులందరినీ లాటరీ కేంద్రాల్లోకి అనుమతించలేమని, అయితే అక్కడ ఏర్పాటు చేసిన స్క్రీన్ల ద్వారా ప్రక్రియను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. యూట్యూబ్‌తో పాటు హౌసింగ్ డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్, సోషల్ మీడియా వేదికల ద్వారా లాటరీ ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని వివరించారు. ఈ పథకానికి ఈ నెల 15 వరకు దరఖాస్తులు స్వీకరించారు. అందిన దరఖాస్తులను పరిశీలించడంతో పాటు అనర్హులుగా గుర్తించిన దరఖాస్తులపై వచ్చిన అభ్యంతరాలను కూడా పరిష్కరించినట్లు గౌతమ్ తెలిపారు.




## ఒలిపింక్స్ మెడల్స్ లక్ష్యం

- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- కొరియా వర్సిటీతో స్పోర్ట్స్ డీల్
- క్రీడా విద్యకు గ్లోబల్ బూస్ట్

తెలంగాణ క్రీడా రంగంలో కీలక ముందడుగు పడింది. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, దక్షిణ కొరియాకు చెందిన కొరియా నేషనల్ స్పోర్ట్ యూనివర్సిటీ కేఎన్ఎస్‌యూతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. హైపర్‌ఫార్మెన్స్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్, అథ్లెట్ల శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్ అభివృద్ధి లక్ష్యంగా ఈ భాగస్వామ్యం ఏర్పడింది. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణలోని యువ క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించడంతో పాటు ప్రపంచ అత్యుత్తమ క్రీడా విధానాలను రాష్ట్రానికి తీసుకురావడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని సీఎం తెలిపారు.






- భట్టి కొండా మురళీ భేటీలో కీలకాంశాలు
- కొండా సురేఖ కొత్త స్కెచ్
- రేవంత్ కు ఝలక్ ఇస్తానంటూ భట్టికి సందేశం
- సస్పెండ్ చేస్తే ఎమ్మెల్యే పదవికీ రాజీనామా
- ఎలక్షన్‌లో అమీతుమీ తేల్చుకుంటా
- జిల్లా మొత్తం రేవంత్ వ్యతిరేకంగా వేవ్ క్రియేట్ చేస్తా
- కొండా సురేఖ ప్రతిజ్ఞ

## రిస్క్‌కు రేవంత్ రెడీనా!?

### కొండా ఫ్యామిలీ సవాల్

తెలంగాణ కాంగ్రెస్ లో కొండా ఫ్యామిలీ పంచాయితీ రోజుకో మలుపు తిరుగుతోంది. మంత్రి కొండా సురేఖపై కాంగ్రెస్ అధిష్ఠానం చర్యలు తీసుకుంటుందన్న ప్రచారం నేపథ్యంలో ఆమె భర్త కొండా మురళీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఈ భేటీలో సురేఖపై వస్తున్న ఆరోపణలు, పార్టీలో నెలకొన్న విభేదాలు, రేవంత్ రెడ్డితో వివాదం వంటి అంశాలపై కీలకంగా చర్చ జరిగినట్టు సమాచారం.. అదే సమయంలో కొండా కుటుంబం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్న సంకేతాలు పంపినట్లు వార్తలు వస్తున్నాయి. (వివరాలు 2లో..)



### భట్టితో కొండా మురళీ భేటీ

సుస్మిత వ్యాఖ్యలపై క్లారిటీ

వేటు ప్రచారంతో ఉత్కంఠ

## డీవీ మనోహర్‌పై ఆరోపణల వెనుక కిలేడీ

- రూ. 30 లక్షల కోసం బ్లాక్‌మెయిల్
- లావణ్య అరాచకాల వెనుక అసలు కథ ఇదే!
- నగదు మాయం తర్వాతే ఆరోపణల దుమారం

ఓ ఉద్యోగి చేసిన ఆరోపణలు.. ఓ ప్రముఖ హోటల్‌లో ఒక్కసారిగా కలకలం రేపాయి. అయితే అసలు కథ ఏమిటి? హోటల్ మనోహర్ యాజమాన్యం చెబుతున్న వివరాలు ఇప్పుడు కొత్త ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. సంస్థలో ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ కమ్ గెస్ట్ రిలేషన్స్ మేనేజర్‌గా పనిచేసిన కొరపు లావణ్యపై హోటల్ యాజమాన్యం తీవ్ర ఆరోపణలు చేసింది. రూ.లక్ష నగదు కనిపించకపోవడంపై ప్రశ్నించిన తర్వాతే వివాదం మొదలైందని తెలిపింది.




## తాళికట్టు శుభవేళ

### అమ్మాయి మెడలో కవితమ్మ తాళి!

పెళ్లి పందిరి.. మంగళవాయిద్యాలు.. వేదమంత్రాల నడుమ ఓ అపూర్వమైన ఘట్టం ఆవిష్కృతమైంది. సాధారణంగా వరుడు వధువు మెడలో తాళి కట్టడం మనకు తెలిసిన సంప్రదాయం. కానీ తెలంగాణలోని ఓ వివాహ వేడుకలో మాత్రం అంతకు ముందు ఓ మహిళ మరో మహిళ మెడలో తాళి కట్టడం అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆ తాళి కట్టింది మరెవరో కాదు.. కల్వకుంట్ల కవిత. రాజకీయాల్లో కవితక్కగా, కవితమ్మగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. ఈ పెళ్లిలో కేవలం అతిథిగా కాకుండా ఆ ఇంటి ఆడపడుచుగా మారి, ఒక ఆప్యాయమైన బాధ్యతను భుజాన వేసుకున్నారు. దీంతో ఆ పెళ్లి వేడుకలో ఈ క్షణం భావోద్వేగానికి ప్రతీకగా నిలిచింది.

## కబ్జాలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ డామేజ్

### రేవంత్ సర్కారుపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు



హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌పై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా వేడి పెంచుతున్నాయి. సెక్షన్ 22ఏ నిషేధిత జాబితా పేరుతో ప్రజల ఆస్తులపై అనిశ్చితి పెరుగుతోందని, దీనివల్ల హైదరాబాద్ మీద పెట్టుబడిదారుల నమ్మకం దెబ్బతింటోందని ఆయన ఆరోపించారు. కూకట్‌పల్లిలో 22ఏ బాధితులతో నిర్వహించిన ముఖాముఖిలో హరీశ్‌రావు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. (వివరాలు 2లో..)




### న్యూయార్క్‌లో మోహన్ భగవత్ కార్యక్రమం

కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తున్న మేయర్

ఆర్ఎస్ఎస్ చీఫ్ ప్రోగ్రామ్‌పై పొలిటికల్ రగడ

## కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం




### లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు

సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట శివారులో తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. బస్సులో మొత్తం 42 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. (వివరాలు 2లో..)

కోదాడ బస్సు ప్రమాదం బాధితులకు అండగా ఏపీ

కళ్ల ముందే భార్య మృతి తృటిలో బయటపడ్డ ప్రయాణికుడు




### వృద్ధులు లక్ష్యంగా సైబర్ ముఠాలు

సోషల్ ఇంజినీరింగ్‌తో కొత్త మోసాలు

## సామాన్యుడి వంటింటిపై బీజేపీ వైఫల్యం



ధరల పెరుగుదలపై ఖర్గే తీవ్ర విమర్శలు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెప్పిన 'అచ్చే దిన్' సామాన్యుడి వంటింటి బడ్జెట్‌ను ఛిద్రం చేశాయని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పండుగల వేళ ఉల్లిపాయ ధరలు ఏడాదిలో 59 శాతం వరకు పెరిగి కొన్ని నగరాల్లో కిలో రూ.50-60కు చేరాయని తెలిపారు. చక్కెర రూ.60-70, కొన్ని ప్రాంతాల్లో రూ.72 వరకు ఉందని, ఆవాల నూనె లీటర్ రూ.200 దాటిందని పేర్కొన్నారు. ఆహార ద్రవ్యోల్బణం 5.52 శాతం, హోల్‌సేల్ ద్రవ్యోల్బణం 9.78 శాతంగా ఉందని వివరించారు. మే 2013తో పోలిస్తే ఆగస్టు 2026లో వంటింటి సరుకుల ధరలు భారీగా పెరిగాయని ఖర్గే వెల్లడించారు. టమాటా ధర కిలో రూ.17.50 నుంచి రూ.120కు పెరిగి 585 శాతం పైగా ఎగబాకిందని, ఉల్లిపాయ రూ.23 నుంచి రూ.73, ఆట్టా రూ.21 నుంచి రూ.69కు చేరాయని చెప్పారు. కందిపప్పు రూ.75 నుంచి రూ.180, మినపప్పు రూ.71 నుంచి రూ.180, శనగపప్పు రూ.50 నుంచి రూ.125కు పెరిగాయని పేర్కొన్నారు. పాలు, బియ్యం, చక్కెర, బంగాళాదుంపలు, వంట నూనెల ధరలు కూడా గణనీయంగా పెరిగాయని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించిన ఖర్గే.. ధరల భారాన్ని ప్రజలు గుర్తుంచుకుంటారని, ఎన్నికల్లో క్షమించరని హెచ్చరించారు.

## భారత్‌కు భారీగా విదేశీ పెట్టుబడులు

### 15 ఏళ్లలోనే అత్యధిక స్థాయికి ఎఫ్‌డీఐ




భారత్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) భారీగా పెరిగాయి. 2026 ఏప్రిల్ -జూన్ త్రైమాసికంలో దేశానికి ఏకంగా 30.7 బిలియన్ డాలర్ల స్థూల ఎఫ్‌డీఐ వచ్చింది. అందుబాటులో ఉన్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గణాంకాల ప్రకారం గత 15 ఏళ్లలో ఇదే అత్యధిక స్థాయి. మార్చితో ముగిసిన త్రైమాసికంతో పోలిస్తే పెట్టుబడులు దాదాపు 46 శాతం పెరగగా, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 15 శాతం వృద్ధి నమోదైంది. జూన్‌లోనే 9.3 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. మే నెలతో పోలిస్తే ఇది 53 శాతం ఎక్కువ. సింగపూర్, నెదర్లాండ్స్, అమెరికా, కెనడా కలిసి దాదాపు 74 శాతం పెట్టుబడులు అందించాయి. తయారీ రంగం అత్యధిక పెట్టుబడులను ఆకర్షించగా, విద్యుత్ ఉత్పత్తి, కంప్యూటర్, కమ్యూనికేషన్ సేవలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. జూన్‌లో నికర ఎఫ్‌డీఐ 1.3 బిలియన్ డాలర్లకు, త్రైమాసికంలో 7.8 బిలియన్ డాలర్లకు చేరింది. మరోవైపు భారత కంపెనీల విదేశీ పెట్టుబడులు తగ్గడం కూడా నికర ఎఫ్‌డీఐ పెరుగుదలకు దోహదపడింది. భారత్‌పై ప్రపంచ పెట్టుబడిదారుల నమ్మకం కొనసాగుతోందని ఆర్‌బీఐ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

# నేపాల్‌లో వరద బీభత్సం

- 133 మంది భారతీయులు గల్లంతు • కైలాస యాత్రికులపై వరద పంజా

నేపాల్‌లో ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. కైలాస మానస సరోవర్ యాత్రకు వెళ్లిన 400 మందికి పైగా యాత్రికులు గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. వీరిలో 133 మంది భారతీయులు ఉన్నట్లు సమాచారం. నేపాల్‌లోని భోటే కోశీ నది ఉద్ధృతంగా ప్రవహించడంతో నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లో భారీ నష్టం జరిగింది. టిబెట్ వైపు నుంచి వచ్చిన వరద నీరు ఒక్కసారిగా కొండ ప్రాంతాలను ముంచెత్తడంతో పలు గ్రామాలు, రహదారులు, వంతెనలు కొట్టుకుపోయాయి. ఈ ఘటనలో మృతుల సంఖ్య 95 దాటినట్లు తాజా సమాచారం. గల్లంతైన వారిలో విదేశీయులతో పాటు నేపాలీ పౌరులు కూడా ఉన్నారు. భారతీయ యాత్రికుల కుటుంబాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వారి ఆచూకీ కోసం నేపాల్ అధికారులు సహాయక చర్యలు వేగవంతం చేశారు.


వివరాలు3లో..

## నేపాల్ వరదలకు కారణమేంటి?

### భూకంపం తర్వాతే ఆకస్మిక వరద

నేపాల్‌లో బీభత్సం సృష్టించిన ఆకస్మిక వరదలకు టిబెట్‌లో సంభవించిన భూకంపమే కారణమై ఉండొచ్చని నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ తెలిపారు. టిబెట్‌లో కొండచరియలు విరిగిపడి భోటే కోశీ నదిలోకి భారీగా నీరు చేరి వరదలకు దారితీసి ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేసినట్లు ఆయన చెప్పారు. టిబెట్‌లో బుధవారం ఉదయం 8.37 గంటలకు 4.4 తీవ్రతతో భూకంపం నమోదైనట్లు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. అదే సమయంలో టిబెట్ గ్యిరోంగ్ పోర్టు ప్రాంతంలో భారీ వరదలు వచ్చిన దృశ్యాలు బయటకు రావడం అనుమానాలను మరింత బలపరిచింది. నేపాల్ విపత్తు నిర్వహణ సంస్థ కూడా చైనా సరిహద్దు సమీపంలో కొండచరియలు, మంచుచరియలు విరిగిపడిన ఆనవాళ్లు శాటిలైట్ చిత్రాల్లో కనిపించినట్లు తెలిపింది. దీంతో వరదలకు అసలు కారణమేంటన్న దానిపై నిపుణులు లోతుగా పరిశీలిస్తున్నారు.

**నేపాల్ వరదల్లో భారీ నష్టం** — ఆస్తులు, ప్రాణాలపై వరద పంజా

**నేపాల్‌కు అండగా ఉంటాం** — బాలేంద్ర షాకు మోదీ ఫోన్

**నేపాల్ వరదలతో భారత్ అలర్ట్** — సరిహద్దు జిల్లాల్లో ముందస్తు చర్యలు

# ఒలిపింక్స్ మెడల్స్ లక్ష్యం

- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- కొరియా వర్సిటీతో స్పోర్ట్స్ డీల్
- క్రీడా విద్యకు గ్లోబల్ బూస్ట్



తెలంగాణ క్రీడా రంగంలో కీలక ముందడుగు పడింది. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, దక్షిణ కొరియాకు చెందిన కొరియా నేషనల్ స్పోర్ట్ యూనివర్సిటీ కేఎన్ఎస్‌యూతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. హైపర్‌ఫార్మెన్స్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్, అథ్లెట్ల శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్ అభివృద్ధి లక్ష్యంగా ఈ భాగస్వామ్యం ఏర్పడింది. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణలోని యువ క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించడంతో పాటు ప్రపంచ అత్యుత్తమ క్రీడా విధానాలను రాష్ట్రానికి తీసుకురావడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని సీఎం తెలిపారు.

### ఒలింపిక్ విజయాలే స్ఫూర్తి

కొరియా నేషనల్ స్పోర్ట్ యూనివర్సిటీ ఇప్పటికే అంతర్జాతీయ క్రీడా రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించింది. పారిస్ ఒలింపిక్స్‌లో దక్షిణ కొరియా సాధించిన 32 పతకాల్లో 16 పతకాలు కేఎన్ఎస్‌యూలో శిక్షణ పొందిన అథ్లెట్ల నుంచే రావడం ఈ సంస్థ సామర్థ్యానికి నిదర్శనమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గతంలో దక్షిణ కొరియా పర్యటనలో కేఎన్ఎస్‌యూ అధ్యక్షుడు మూన్ వోన్ జేతో పాటు ప్రతినిధి బృందాన్ని కలిసిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. అప్పుడే రెండు సంస్థల మధ్య భాగస్వామ్యంపై చర్చలు జరిగాయని తెలిపారు. ఇప్పుడు ఆ చర్చలు ఒప్పందంగా మారడంతో తెలంగాణ క్రీడా రంగానికి కొత్త అవకాశాలు తెరుచుకున్నాయి.

### 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా అడుగులు

గ్రామాలు, పట్టణాల్లోని ప్రతిభను ఒలింపిక్ పతక స్థాయికి తీసుకెళ్లడమే తెలంగాణ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. భారత్ 2036 ఒలింపిక్స్ దిశగా సిద్ధమవుతున్న నేపథ్యంలో తెలంగాణ కూడా కీలక పాత్ర పోషించాలని ప్రభుత్వం భావిస్తోంది. కేవలం ఒలింపిక్స్ నిర్వహణకు సిద్ధం కావడం కాకుండా, దేశానికి గర్వకారణంగా నిలిచే అథ్లెట్లను తయారు చేయాలన్నదే లక్ష్యమన్నారు. స్పోర్ట్స్ మంత్రి వాకిటి శ్రీహరి, క్రీడా శాఖ అధికారులు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఈ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంపై సీఎం అభినందనలు తెలిపారు. కొరియా శిక్షణా విధానాలు తెలంగాణ యువతకు అందితే రాష్ట్రం నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుల తయారీకి బలమైన పునాది పడే అవకాశం ఉంది.

# రిస్క్‌కు రేవంత్ రెఢీనా!?

- కొండా ఫ్యామిలీ సవాల్
- భట్టి- కొండా మురళీ భేటీలో కీలకాంశాలు
- కొండా సురేఖ కొత్త స్కెచ్
- రేవంత్ కు ఝలక్ ఇస్తానంటూ భట్టికి సందేశం
- సస్పెండ్ చేస్తే ఎమ్మెల్యే పదవికీ రాజీనామా
- ఎలక్షన్‌లో అమీతుమీ తేల్చుకుంటా
- కొండా సురేఖ ప్రతిజ్ఞ



తెలంగాణ కాంగ్రెస్ లో కొండా ఫ్యామిలీ పంచాయితి రోజుకో మలుపు తిరుగుతోంది. మంత్రి కొండా సురేఖపై కాంగ్రెస్ అధిష్ఠానం చర్యలు తీసుకుంటుందన్న ప్రచారం నేపథ్యంలో ఆమె భర్త కొండా మురళీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఈ భేటీలో సురేఖపై వస్తున్న ఆరోపణలు, పార్టీలో నెలకొన్న విభేదాలు, రేవంత్ రెడ్డితో వివాదం వంటి అంశాలపై కీలకంగా చర్చ జరిగినట్టు సమాచారం.. అదే సమయంలో కొండా కుటుంబం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్న సంకేతాలు పంపినట్లు వార్తలు వస్తున్నాయి.

### సస్పెన్షన్ అయితే రాజీనామా

సురేఖను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే ఎమ్మెల్యే పదవికి సైతం రాజీనామా చేసి రాజకీయంగా అమీతుమీకి సిద్ధమవుతామనే సందేశాన్ని భట్టికి మురళి చేరవేసినట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రేవంత్ ప్రభుత్వానికి ఝలక్ ఇచ్చేలా భవిష్యత్ రాజకీయ వ్యూహాన్ని సిద్ధం చేసుకుంటున్నట్టు కొండా కుటుంబం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఉపఎన్నిక వచ్చినప్పుడు ఎవరి బలం ఎంతో తేల్చుకుంటానని, తన నియోజకవర్గంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో రేవంత్ వ్యతిరేక వేవ్ సృష్టిస్తాననే స్థాయిలో సురేఖ వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం. దీంతో ఈ వ్యవహారం వ్యక్తిగత విభేదాలను దాటి రాజకీయ సవాల్‌గా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### రేవంత్‌కు కొత్త రిస్క్

కొండా సురేఖ వ్యవహారం ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాజకీయంగా సున్నితమైన పరీక్షగా మారవచ్చని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. చర్యలు తీసుకుంటే కొండా కుటుంబం తిరుగుబాటు స్వరం మరింత పెంచే అవకాశం ఉండగా, చర్యలు తీసుకోకుండా వదిలేస్తే పార్టీ క్రమశిక్షణపై ప్రశ్నలు తలెత్తే పరిస్థితి ఉంది. ఈ మొత్తం వ్యవహారం రేవంత్ రెడ్డి ఇజ్జత్‌కు సవాల్‌గా మారింది. దీంతో ఎలాంటి రిస్క్ కైనా రెడీ అంటూ రేవంత్ కొండా సురేఖపై వేటుకే మొగ్గు చూపుతున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. చివరకు ఈ వివాదంలో కొండెక్కేదెవరో చూడాలి.

# భట్టితో కొండా మురళీ భేటీ

- సుస్మిత వ్యాఖ్యలపై క్లారిటీ



తెలంగాణ కాంగ్రెస్‌లో తాజా పరిణామాలు ఉత్కంఠ రేపుతున్నాయి. క్రమశిక్షణ కమిటీ నివేదిక నేపథ్యంలో కొండా మురళీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. వరంగల్ జిల్లా పరకాలలో కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో సుస్మిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో ప్రకంపనలు సృష్టించాయి. సీఎం రేవంత్‌రెడ్డి హామీలు నెరవేర్చలేదని విమర్శించిన ఆమె.. పరకాల టికెట్ విషయంలో తనకు అవకాశం ఇవ్వకపోతే స్వతంత్రంగా పోటీ చేస్తానని ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో కొండా మురళీ సుస్మిత వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలేనని తేల్చి చెప్పారు. ఆమెకు స్వతంత్రంగా మాట్లాడే హక్కు ఉందని, ఆమె వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదన్నారు. క్రమశిక్షణ కమిటీకి చెప్పాల్సిన విషయాలన్నీ ఇప్పటికే వివరించామని, నిర్ణయం వచ్చే వరకు తాను మరిన్ని వ్యాఖ్యలు చేయబోనని స్పష్టం చేశారు. తాజా పరిణామాల మధ్య కొండా కుటుంబం కాంగ్రెస్‌ను వీడుతుందన్న ప్రచారానికి కొండా మురళీ తెరదించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు.



# కబ్జాలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ డామేజ్

హైదరాబాద్ అంటే కేవలం భవనాలు, రహదారులు, ఐటీ సంస్థలు మాత్రమే కాదని, స్థిరమైన ఆస్తి మార్కెట్, పెట్టుబడులకు నమ్మకం, భద్రత అనే మూడు అంశాలే నగర బ్రాండ్‌కు బలమని ఆయన వ్యాఖ్యల సారాంశం. ప్రజలు ఏళ్ల తరబడి కష్టపడి నిర్మించుకున్న ఇళ్ల స్థలాలపై హక్కులు స్పష్టంగా లేకపోతే హైదరాబాద్ ప్రతిష్ఠకు నష్టం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భూములపై స్పష్టతే హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు కీలకమన్న అంశాన్ని హరీశ్‌రావు ముందుకు తెచ్చారు.

### కేసీఆర్ పాలనతో పోలిక

హైదరాబాద్ అభివృద్ధి విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు ప్రస్తావించారు. కేసీఆర్ పాలనలో హైదరాబాద్‌ను దేశ, ప్రపంచ పెట్టుబడులకు అనుకూల నగరంగా తీర్చిదిద్దామని ఆయన అన్నారు. ఐటీ రంగం, మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు వంటి అంశాలతో నగరానికి అంతర్జాతీయ గుర్తింపు పెరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం భూముల విషయంలో నెలకొన్న అనిశ్చితి ఆ ఇమేజ్‌కు ప్రతికూలంగా మారుతోందని విమర్శించారు. హైదరాబాద్‌లో ఆస్తి కొనుగోలు భద్రమనే నమ్మకం ఉంటేనే పెట్టుబడులు వస్తాయని, భూమి ఎప్పుడు 22ఏలోకి వెళ్తుందో తెలియని పరిస్థితి ఉంటే కొనుగోలుదారులు వెనక్కి తగ్గే ప్రమాదం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికాలో ఉన్న తెలంగాణవాసులు సైతం హైదరాబాద్‌లో పెట్టుబడుల విషయంలో ఆలోచించే పరిస్థితి వచ్చిందని హరీశ్‌రావు ఆరోపించారు.

### 22ఏపై ప్రభుత్వానికి సవాల్

సెక్షన్ 22ఏ జాబితాలో చేర్చిన భూముల విషయంలో ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం సరికాదని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం చేసిన తప్పు వల్ల ప్రజలు ఎందుకు ఇబ్బంది పడాలని ప్రశ్నిస్తూ, 22ఏ జాబితాను ప్రభుత్వం స్వయంగా సమీక్షించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భూములపై బ్యాంకు రుణాలు రాకపోవడం, అమ్మకాలు నిలిచిపోవడం వంటి సమస్యలు ప్రజలను ఆర్థికంగా ఇబ్బంది పెడుతున్నాయని చెప్పారు. బ్రోకర్లకు డబ్బులు ఇవ్వొద్దని బాధితులకు సూచించారు. సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని బలంగా లేవనెత్తుతామని ప్రకటించారు. హైదరాబాద్‌లో ఆస్తులపై నమ్మకం దెబ్బతింటే దాని ప్రభావం రియల్ ఎస్టేట్‌తో పాటు ఐటీ, పరిశ్రమలు, సేవారంగాలపైనా పడే అవకాశం ఉందన్నది ఈ వివాదం వెనుక ప్రధాన ఆందోళనగా కనిపిస్తోంది.

### సెక్రటేరియట్ ముట్టడి హెచ్చరిక

22ఏ జాబితాలోని భూముల సమస్యను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు. భేషరతుగా 22ఏ జాబితాలోని భూముల సమస్యను పరిష్కరించకపోతే సచివాలయం ముట్టడిస్తామని ప్రకటించారు. ప్రజల ఆస్తులు, భూముల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. రేవంత్ ప్రభుత్వం భూములపై ఎక్కువగా దృష్టి పెట్టిందంటూ ఆయన చేసిన విమర్శలు ఇప్పుడు రాజకీయ చర్చకు కేంద్రంగా మారాయి. మరోవైపు ప్రభుత్వం ఈ ఆరోపణలకు ఎలాంటి సమాధానం ఇస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడాలంటే భూములపై స్పష్టమైన హక్కులు, వేగవంతమైన పరిష్కారాలు, పెట్టుబడిదారులకు నమ్మకం అవసరం. ఈ అంశంపై రాజకీయ పోరాటం ముదిరితే నగర భవిష్యత్ ఆస్తి మార్కెట్‌పై దాని ప్రభావం ఎలా ఉంటుందన్నది కీలకంగా మారనుంది.

# తాళికట్టు శుభవేళ

## అమ్మాయి మెడలో కవితమ్మ తాళి!



పెళ్లి పందిరి.. మంగళవాయిద్యాలు.. వేదమంత్రాల నడుమ ఓ అపూర్వమైన ఘట్టం ఆవిష్కృతమైంది. సాధారణంగా వరుడు వధువు మెడలో తాళి కట్టడం మనకు తెలిసిన సంప్రదాయం. కానీ తెలంగాణలోని ఓ వివాహ వేడుకలో మాత్రం అంతకు ముందు ఓ మహిళ మరో మహిళ మెడలో తాళి కట్టడం అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆ తాళి కట్టింది మరెవరో కాదు.. కల్వకుంట్ల కవిత. రాజకీయాల్లో కవితక్కగా, కవితమ్మగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. ఈ పెళ్లిలో కేవలం అతిథిగా కాకుండా ఆ ఇంటి ఆడపడుచుగా మారి, ఒక ఆప్యాయమైన బాధ్యతను భుజాన వేసుకున్నారు. దీంతో ఆ పెళ్లి వేడుకలో ఈ క్షణం భావోద్వేగానికి ప్రతీకగా నిలిచింది.

### ఆచారం కోసం అక్కగా మారిన కవితమ్మ

యాదాద్రికి చెందిన తెలంగాణ రక్షణ సేన యువనేత బాల ప్రసాద్‌కు శివాణితో వివాహం కీసర రోడ్డులోని ఆరాధ్య ఫంక్షన్ హాల్‌లో వైభవంగా జరిగింది. ముదిరాజ్ సంప్రదాయంలో వధువుకు ముందుగా వరుడి సోదరి తాళి కట్టిన తర్వాతే వరుడు మంగళసూత్రం కడతారని చెబుతారు. అయితే బాల ప్రసాద్‌కు అక్కాచెల్లెళ్లు లేకపోవడంతో ఆ ఆచారం ఎలా పూర్తవుతుందన్న ప్రశ్న ఎదురైంది. అక్క స్థానంలో తానే నిలవాలని కవితమ్మను కోరిన బాల ప్రసాద్ అభ్యర్థనకు ఆమె ఆప్యాయంగా స్పందించారు. పుట్టింటి బంధం లేని చోట ఆత్మీయతతో బంధాన్ని నిర్మించుకున్న ఆమె.. వధువు శివాణి మెడలో తొలుత తాళి కట్టారు. ఆ క్షణంలో పెళ్లి వేదిక ఒక్కసారిగా భావోద్వేగంతో నిండిపోయింది.

### ఆత్మీయతకు నిదర్శనంగా పెళ్లి వేడుక

ఆ తర్వాత వరుడు బాల ప్రసాద్ తన జీవిత భాగస్వామి శివాణి మెడలో మంగళసూత్రం కట్టి వివాహ తంతును సంపూర్ణం చేశారు. రాజకీయాలకు అతీతంగా, మనుషుల మధ్య ఉండే అనుబంధానికి ఈ వేడుక ఒక అందమైన ఉదాహరణగా నిలిచింది. రక్తసంబంధం లేకపోయినా.. మనసున్న చోట బంధం పుడుతుందని, ఆప్యాయత ఉన్న చోట ఆడపడుచు బాధ్యత కూడా పంచుకోవచ్చని కవితమ్మ ఆచరణలో చూపించారు. అందుకే ఈ పెళ్లి తంతులో తాళి కట్టిన ఆ ఒక్క క్షణం ప్రత్యేకంగా నిలిచింది. పెళ్లి మండపంలో మోగిన మంగళవాయిద్యాల మధ్య.. ఒక అక్కగా కవితమ్మ చేతుల మీదుగా జరిగిన ఆ తాళికట్టు శుభవేళ.. ఆ కుటుంబానికి ఎప్పటికీ మధుర జ్ఞాపకంగానే మిగిలిపోనుంది.



# వృద్ధులు లక్ష్యంగా సైబర్ ముఠాలు

## సోషల్ ఇంజినీరింగ్‌తో కొత్త మోసాలు

హైదరాబాద్ నగరంలో సరికొత్త హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్ ముఠాలు వృద్ధులు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్న అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నాయని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో స్మార్ట్‌ఫోన్ వినియోగించే వారిని ఈ ముఠాలు ముందుగా గమనిస్తాయి. ముఖ్యంగా వారు స్క్రీన్ లాక్ ఎలా తెరుస్తున్నారో వెనుక నుంచి నిశితంగా పరిశీలించి, ఆ తర్వాత ఫోన్‌ను చోరీ చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఫోన్ లాక్ అయి పాస్‌వర్డ్ తెలియకపోతే సోషల్ ఇంజినీరింగ్ పద్ధతులకు పాల్పడుతున్నారు. బాధితుడు ఫోన్‌కు కాల్ చేస్తే బస్సు కండక్టర్ లేదా డ్రైవర్‌గా పరిచయం చేసుకుని, ఫోన్ బస్సులో దొరికిందని చెబుతారు. వచ్చే స్టాప్‌లో ఇస్తామని నమ్మించి, వివరాలు సరిచూసే పేరుతో పాస్‌వర్డ్‌ను బాధితుడితోనే చెప్పించుకుంటారు. మరికొన్ని సందర్భాల్లో రోడ్డుపై ఫోన్ దొరికిందని, మరో వ్యక్తి కూడా తనదేనంటున్నాడని చెప్పి పాస్‌వర్డ్ రాబడుతున్నారు.

### ఫోన్ పోతే వెంటనే చర్యలు

ఫోన్ పోయిన వెంటనే టెలికాం సంస్థను సంప్రదించి సిమ్‌ను బ్లాక్ చేయించాలని సీపీ సూచించారు. బ్యాంక్ కస్టమర్ కేర్‌కు కాల్ చేసి నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ సేవలను తాత్కాలికంగా ఫ్రీజ్ చేయించాలి. కేంద్ర ప్రభుత్వ అధికారిక CEIR పోర్టల్‌లో మొబైల్ IMEI నంబర్ నమోదు చేసి ఫోన్‌ను బ్లాక్ చేయించాలి. ఖాతా నుంచి డబ్బులు కట్ అయినట్లు గుర్తిస్తే ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేయాలి. ఇంట్లోని యువత తమ కుటుంబాల్లోని వృద్ధులకు ఈ తరహా మోసాలపై అవగాహన కల్పించాలని సజ్జనార్ సూచించారు. ప్రయాణాల్లో ఫోన్ ఉపయోగించే సమయంలో పాస్‌వర్డ్ ఇతరులకు కనిపించకుండా జాగ్రత్తపడాలని, ఫోన్ పోయినప్పుడు ఎలాంటి సమాచారం అపరిచితులకు చెప్పకూడదని ఆయన స్పష్టం చేశారు.



# కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు

సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట శివారులో తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. బస్సులో మొత్తం 42 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. మృతులంతా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారిగా గుర్తించారు. ఎన్టీఆర్ జిల్లా తేలప్రోలుకు చెందిన యాసారపు చిన్ని, విజయవాడకు చెందిన మేరీ జ్యోత్స్న, నాగేంద్రబాబు, సురవరపు షకీనా, భావన, లక్ష్మి మృతుల్లో ఉన్నారు. ప్రమాదంలో మరో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. లారీలో ఉన్న ఐరన్ షీట్లు బస్సులోకి చొచ్చుకురావడంతో నిద్రలో ఉన్న ప్రయాణికులకు తీవ్ర గాయాలైనట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గాయపడిన వారిని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

### నిద్రమత్తే కారణమా? సీఎం దిగ్భ్రాంతి

బస్సు డ్రైవర్ నిద్రమత్తు, అతివేగం ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదం తర్వాత డ్రైవర్ మల్లికార్జున అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఏలూరు చేరాల్సిన బస్సు తెల్లవారుజామున 4 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. సమాచారం అందుకున్న వెంటనే అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో సూర్యాపేట కలెక్టర్, జిల్లా ఎస్పీ కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని బస్సు యాజమాన్యాలకు సీఎం సూచించారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బాధితులకు అండగా ఏపీ

సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై ఏపీ మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన 11 మందిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు పవన్‌కు వివరించారు. తెలంగాణ అధికారులతో ఏపీ యంత్రాంగం సమన్వయం చేసుకుంటూ బాధితులకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి నారా లోకేశ్ కూడా ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదంపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేకంగా స్పందించారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల భద్రతా ప్రమాణాలు, డ్రైవర్ల అప్రమత్తత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. రోడ్డు భద్రతా నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా అధికారులు మరింత కఠినంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

# కళ్ల ముందే భార్య మృతి

- బస్సు ప్రమాద విషాదం
- తృటిలో బయటపడ్డ ప్రయాణికుడు

కోదాడ సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం ప్రయాణికుల కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు దుర్గాపురం స్టేజి వద్ద ప్రమాదానికి గురైంది. వెనుక సీట్లో తన భార్య కూర్చుందని, ప్రమాదంలో ఆమె కళ్ల ముందే మృతి చెందిందని ఓ ప్రయాణికుడు కన్నీరుమున్నీరయ్యాడు. టీ బ్రేక్ తర్వాత బస్సు తిరిగి బయలుదేరిన గంటలోపే ప్రమాదం జరిగిందని చెప్పాడు. ముందు సీట్లలో ఉన్న ప్రయాణికులు కూడా తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశాడు. డ్రైవర్ నిద్రమత్తులో వాహనం నడపడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆరోపించారు.

### ఇనుప రాడ్లే ప్రాణాలు తీశాయా?

రోడ్డుపై ముందే ప్రమాదానికి గురై ఆగి ఉన్న లారీని ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. లారీలోని పెద్ద ఇనుప రాడ్లు బస్సులోకి దూసుకెళ్లి ప్రయాణికులకు తీవ్ర గాయాలు కలిగించాయి. తల, ఛాతి, కడుపు భాగాల్లో బలమైన గాయాలు కావడంతో పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదంలో ఆరుగురు ఆసుపత్రికి చేరుకునేలోపే మృతి చెందారని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలిపారు. మరో 14 మందిని తీవ్ర గాయాలతో ఆసుపత్రికి తరలించగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెప్పారు. లారీ రోడ్డుపై నిలిచి ఉన్నప్పటికీ బస్సు డ్రైవర్ దాన్ని గుర్తించకపోవడమే ప్రమాదానికి ప్రధాన కారణమని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# రాహుల్ వ్యాఖ్యలపై కంగనా వ్యంగ్యం


కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ 'పితృస్వామ్యాన్ని కూల్చేయాలి' అంటూ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ వ్యంగ్యంగా స్పందించారు. సోషల్ మీడియాలో ఆమె షేర్ చేసిన చిత్రంలో రాహుల్ ఓ మహిళను పితృస్వామ్యాన్ని సవాలు చేయాలని కోరుతున్నట్లు చూపించారు. దానికి ఆ మహిళ 'బ్రో.. ఆగండి. ముందుగా భారత్ మాతాకీ జైతో ప్రారంభిద్దాం' అని చెప్పినట్లు చిత్రాన్ని రూపొందించారు. ఈ పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆగస్టు 22న పుణెలో జరిగిన కార్యక్రమంలో రాహుల్ మహిళల దుస్తులు, వ్యక్తిగత స్వేచ్ఛపై మాట్లాడారు. మహిళలు ఏం ధరించాలి, ఎలా ఉండాలి అనే విషయాలను ఇతరులు నిర్ణయించకూడదని అన్నారు.

ఈ వ్యాఖ్యలు నటి కృతి సనన్ దుస్తులపై జరిగిన వివాదం నేపథ్యంలో వచ్చాయి. కృతి సనన్ ధరించిన దుస్తులపై విమర్శలు రావడంతో రాహుల్ ఆమెకు మద్దతుగా నిలిచారు. అయితే కంగనా గతంలో కృతి దుస్తులను తీవ్రంగా విమర్శించారు. వివాదం పెరగడంతో ప్రకటన సంస్థ ఆ యాడ్‌ను వెనక్కి తీసుకుంది. ఇదే అంశంపై బీజేపీ ఎంపీ బాన్సురీ స్వరాజ్ కూడా రాహుల్‌ను విమర్శించారు. మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు వచ్చినప్పుడు ఆయన స్పందించలేదని ఆరోపించారు. దీంతో మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, పితృస్వామ్యం అంశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.



# న్యూయార్క్‌లో మోహన్ భగవత్ కార్యక్రమం

- న్యూయార్క్‌లో మోహన్ భగవత్ కార్యక్రమం
- కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తున్న మేయర్
- ఆర్ఎస్ఎస్ చీఫ్ ప్రోగ్రామ్‌పై పొలిటికల్ రగడ



న్యూయార్క్‌లో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పాల్గొనే కార్యక్రమంపై రాజకీయ వివాదం ముదురుతోంది. ఆగస్టు 29న మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో జరగనున్న ఈ కార్యక్రమాన్ని న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ వ్యతిరేకించడం చర్చనీయాంశంగా మారింది. అమెరికన్ హిందూస్ ఫర్ ఎంగేజ్‌మెంట్ అండ్ డైలాగ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అమెరికన్ హిందూ సమాజాన్ని ఒక వేదికపైకి తీసుకురావడం, మతం, ప్రజాస్వామ్యం, సామాజిక అంశాలపై చర్చకు అవకాశం కల్పించడం లక్ష్యంగా నిర్వాహకులు చెబుతున్నారు. అయితే ఆర్ఎస్ఎస్ కార్యక్రమం తనకు ఆందోళన కలిగిస్తోందని మమ్దానీ పేర్కొన్నారు. అమెరికా బహుళత్వం, లౌకిక విలువలకు నిలయమని, ఒక వర్గాన్ని వెలివేసే ధోరణులకు తాను వ్యతిరేకమని ఆయన వ్యాఖ్యానించారు.

### మేయర్‌పై మేరీ మిల్బెన్ ఫైర్

మమ్దానీ వ్యాఖ్యలపై అమెరికన్ సింగర్, నటి మేరీ మిల్బెన్ తీవ్రంగా స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీపై వ్యతిరేకత కారణంగానే ఆర్ఎస్ఎస్ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారని ఆమె ఆరోపించారు. కార్యక్రమం నచ్చని వారు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసుకోవచ్చని, అవసరమైతే సొంతంగా ర్యాలీ నిర్వహించుకోవచ్చని సూచించారు. మోదీ వ్యతిరేకతతో ఒక కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకోవడం సరికాదని ఆమె విమర్శించారు. ఆర్ఎస్ఎస్ కార్యక్రమం తనకు నచ్చిందని చెప్పిన మిల్బెన్.. భారత్‌లో మత స్వేచ్ఛపై అర్థవంతమైన చర్చ జరగాలని ఆకాంక్షించారు. దీంతో మేయర్ వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా ఆమె చేసిన విమర్శలు అమెరికాలోని భారతీయ సమాజం, రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు తెరతీశాయి.

### హక్కులు, భావజాలంపై కొత్త చర్చ

ఈ వివాదం ఇప్పుడు ఒక కార్యక్రమానికి పరిమితం కాకుండా భావ ప్రకటనా స్వేచ్ఛ, మత స్వేచ్ఛ, బహుళత్వం, రాజకీయ భేదాభిప్రాయాల హక్కు వంటి అంశాలపై చర్చకు దారితీస్తోంది. కార్యక్రమం ప్రైవేట్ ఈవెంట్ కావడంతో దాన్ని రద్దు చేసే చట్టపరమైన అధికారం తనకు ఉందో లేదో తెలియదని మమ్దానీ స్వయంగా పేర్కొన్నారు. మరోవైపు మిల్బెన్ మాత్రం విభిన్న అభిప్రాయాలు ఉన్నప్పటికీ ఒక సంస్థ కార్యక్రమాన్ని నిర్వహించుకునే హక్కును గౌరవించాలని వాదిస్తున్నారు. మోహన్ భగవత్ పాల్గొనే కార్యక్రమంపై మొదలైన ఈ వివాదం.. ఇప్పుడు న్యూయార్క్ రాజకీయాలు, అమెరికన్ హిందూ సమాజం, భారత్‌కు సంబంధించిన రాజకీయ భావజాలాల మధ్య చర్చగా మారింది. ఆగస్టు 29న జరగనున్న కార్యక్రమానికి ముందు ఈ అంశంపై మరిన్ని రాజకీయ స్పందనలు వచ్చే అవకాశం కనిపిస్తోంది.

# ఓబీసీ క్రీమీ లేయర్ లెక్క తేలనుందా?

- ఆదాయ పరిమితిపై సుప్రీం స్పష్టత



ఓబీసీ క్రీమీ లేయర్ నిర్ణయంలో ఆదాయం, సంపద ఆధారిత పరీక్షకు సంబంధించి మార్చి 11న ఇచ్చిన తీర్పుపై కేంద్ర ప్రభుత్వం కోరిన వివరణను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు సిద్ధమైంది. ఈ తీర్పును గత నియామకాలు, ప్రవేశాలకు వర్తింపజేస్తే తీవ్ర పరిణామాలు తలెత్తే అవకాశం ఉందని కేంద్రం కోర్టుకు తెలిపింది. 2012 నుంచి ఇప్పటివరకు ఇప్పటికే ఖరారైన ఉద్యోగాలు, సేవా నియామకాలు, పరీక్షలు, ప్రవేశాలపై తీర్పును వెనక్కి వెళ్లి అమలు చేయడం అత్యంత క్లిష్టమని పేర్కొంది. దాని ప్రభావం కేవలం ఓబీసీ వర్గానికే పరిమితం కాకుండా ఇతర కేటగిరీలపై కూడా పడే అవకాశం ఉందని కేంద్రం అభిప్రాయపడింది. ఈ అంశంపై వివరణ కోసం దాఖలైన పిటిషన్లను విచారించేందుకు ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేసే అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలించనుంది.

**వెనక్కి అమలు చేస్తే గందరగోళం**

మార్చి తీర్పును గత నియామకాలకు వర్తింపజేస్తే ఇప్పటికే ఉద్యోగాలు, విద్యా ప్రవేశాలు, నియామక ప్రక్రియలు పూర్తిచేసుకున్న వారిపై ప్రభావం పడుతుందని కేంద్రం వాదించింది. నాన్‌క్రీమీ లేయర్ సర్టిఫికెట్ పొందని లేదా దరఖాస్తు చేయని వ్యక్తులు కూడా తీర్పును ఆధారంగా చేసుకుని కొత్తగా అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశం ఉందని డీవోపీటీ పేర్కొంది. దీనివల్ల గతంలో జరిగిన ఎంపికలు, నియామకాలపై పెద్ద సంఖ్యలో వివాదాలు తలెత్తే ప్రమాదం ఉందని తెలిపింది. ఇప్పటికే స్థిరపడిన సేవా వ్యవస్థను మార్చడం వల్ల అనేక వర్గాలపై ప్రభావం పడే అవకాశం ఉందని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో తీర్పు అమలు పరిధి, ముఖ్యంగా రెట్రోస్పెక్టివ్ అమలు చేయాలా లేదా భవిష్యత్ నియామకాలకు మాత్రమే వర్తింపజేయాలా అనే అంశంపై సుప్రీంకోర్టు స్పష్టత ఇవ్వడం కీలకంగా మారింది.

# బానిసలుగా టీనేజర్లు

- సోషల్ మీడియా ఎఫెక్ట్
- మెటా బిగ్ సెటిల్‌మెంట్
- లక్షన్నర కోట్లు డీల్‌కు సై

పిల్లలు, యువతపై ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ప్రభావానికి సంబంధించిన కేసుల్లో మెటా ప్లాట్‌ఫామ్స్ భారీ సెటిల్‌మెంట్‌కు అంగీకరించింది. అమెరికాలోని 29 రాష్ట్రాలు దాఖలు చేసిన కేసుల పరిష్కారానికి గరిష్ఠంగా 16.68 బిలియన్ డాలర్లు, సుమారుగా లక్షన్నర కోట్ల రూపాయల వరకు చెల్లించేందుకు కంపెనీ అంగీకరించినట్లు కోర్టు పత్రాలు వెల్లడించాయి. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను పిల్లలకు వ్యసనంగా మారేలా రూపొందించారని, వాటి భద్రతపై వినియోగదారులను తప్పుదోవ పట్టించారని, పిల్లల వ్యక్తిగత సమాచారాన్ని అనుమతి లేకుండా సేకరించారని రాష్ట్రాలు ఆరోపించాయి. కాలిఫోర్నియా ఫెడరల్ కోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో ఈ ఒప్పందం కుదిరింది. అయితే మెటా ఎలాంటి తప్పు చేయలేదని స్పష్టం చేసింది. ఒప్పందంలో భాగంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ టీనేజర్ల వినియోగంపై రోజువారీ పరిమితులు, రాత్రివేళ బ్లాకింగ్ వంటి కొత్త నిబంధనలు అమలు చేయనుంది.

**యూత్ మెంటల్ హెల్త్‌పై ప్రభావం**

సోషల్ మీడియా కంపెనీలు పిల్లలు, యువతలో మానసిక ఆరోగ్య సమస్యలకు కారణమయ్యేలా తమ ప్లాట్‌ఫామ్‌లను రూపొందించాయని ఆరోపిస్తూ అమెరికాలో వేలాది కేసులు కొనసాగుతున్నాయి. మెటాతో పాటు స్నాప్, యూట్యూబ్, టిక్‌టాక్ సంస్థలపై కూడా రాష్ట్రాలు, పాఠశాల జిల్లాలు, వ్యక్తులు న్యాయపోరాటం చేస్తున్నారు. పిల్లల డేటాను తల్లిదండ్రుల అనుమతి లేకుండా సేకరించి మెషీన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ మోడళ్ల శిక్షణకు ఉపయోగించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. యువత భద్రతపై మెటా విధానాల్లో మార్పులకు ఈ సెటిల్‌మెంట్ దారి తీయనుంది. ఇప్పటికే న్యూ మెక్సికోలో మెటాపై కేసులో భారీ పరిహారం విధించగా, లాస్‌ఏంజెల్స్‌లో మరో కేసులోనూ కంపెనీకి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో పిల్లల సోషల్ మీడియా వినియోగం, డేటా గోప్యత, మానసిక ఆరోగ్యంపై అమెరికాలో న్యాయపోరాటం మరింత కీలక దశకు చేరుకుంది.



# నేపాల్‌లో వరద బీభత్సం

- 133 మంది భారతీయులు గల్లంతు
- కైలాస యాత్రికులపై వరద పంజా

నేపాల్‌లో ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. కైలాస మానస సరోవర్ యాత్రకు వెళ్లిన 400 మందికి పైగా యాత్రికులు గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. వీరిలో 133 మంది భారతీయులు ఉన్నట్లు సమాచారం. నేపాల్‌లోని భోటే కోశీ నది ఉద్ధృతంగా ప్రవహించడంతో నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లో భారీ నష్టం జరిగింది. టిబెట్ వైపు నుంచి వచ్చిన వరద నీరు ఒక్కసారిగా కొండ ప్రాంతాలను ముంచెత్తడంతో పలు గ్రామాలు, రహదారులు, వంతెనలు కొట్టుకుపోయాయి. ఈ ఘటనలో మృతుల సంఖ్య 95 దాటినట్లు తాజా సమాచారం. గల్లంతైన వారిలో విదేశీయులతో పాటు నేపాలీ పౌరులు కూడా ఉన్నారు. భారతీయ యాత్రికుల కుటుంబాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వారి ఆచూకీ కోసం నేపాల్ అధికారులు సహాయక చర్యలు వేగవంతం చేశారు.

### హైవేలు మూసివేత.. విద్యుత్ వ్యవస్థకు దెబ్బ

వరద తీవ్రతకు రవాణా వ్యవస్థతో పాటు విద్యుత్ మౌలిక వసతులు కూడా దెబ్బతిన్నాయి. రసువాగఢి, చిలిమే, త్రిశూలీ 3ఏ, త్రిశూలీ 3బీ హబ్ 220 కేవీ సబ్‌స్టేషన్, త్రిశూలీ, దేవీఘాట్ విద్యుత్ కేంద్రాలకు నష్టం జరిగినట్లు నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ తెలిపింది. దీంతో విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థల్లో అంతరాయం ఏర్పడింది. పలు ప్రధాన రహదారులు మూసివేయడంతో సహాయక బృందాల రాకపోకలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొండ లోయల్లో బురదతో కూడిన వరద నీరు ఉద్ధృతంగా దూసుకెళ్లిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు హెచ్చరించారు. వరద ప్రభావం ఎంత మేరకు ఉందో



పూర్తిస్థాయిలో అంచనా వేయడం ఇంకా సాధ్యం కాలేదని అధికారులు చెబుతున్నారు.

### హెలికాప్టర్లతో ముమ్మర గాలింపు

గల్లంతైన వారి కోసం నేపాల్ సైన్యం, పోలీస్ బలగాలు రంగంలోకి దిగాయి. హెలికాప్టర్లు, విపత్తు సహాయక సిబ్బందిని ప్రభావిత ప్రాంతాలకు తరలించి గాలింపు చర్యలు చేపట్టారు. రసువా జిల్లాలో నేపాల్ పోలీసులకు చెందిన 26 మంది సిబ్బంది, సాయుధ పోలీసు దళానికి చెందిన ఏడుగురు సిబ్బంది కూడా గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. అత్యవసర పరిస్థితిని సమీక్షించేందుకు ప్రధాని బాలేంద్ర షా జాతీయ విపత్తు నిర్వహణ సంస్థతో సమావేశం నిర్వహించారు. వైద్య బృందాలు, రెడ్‌క్రాస్, ఇతర సహాయక సంస్థలను సమన్వయం చేసి సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉండటంతో గల్లంతైన భారతీయుల ఆచూకీపై కుటుంబాల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. మరోవైపు వర్షాకాలంలో నేపాల్‌లో వరదలు, కొండచరియలు సాధారణమే అయినా వాతావరణ మార్పుల కారణంగా తీవ్ర వాతావరణ ఘటనలు పెరుగుతున్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

## నేపాల్‌కు అండగా ఉంటాం

- బాలేంద్ర షాకు మోదీ ఫోన్

నేపాల్‌లో మెరుపు వరదలు సృష్టించిన బీభత్సంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో బుధవారం ఫోన్‌లో మాట్లాడిన మోదీ.. వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలిపారు. నేపాల్‌లో నెలకొన్న పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కష్ట సమయంలో నేపాల్ ప్రజలకు భారతదేశం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని, సహాయక రక్షణ చర్యల్లో ఇరు దేశాల బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని మోదీ తెలిపారు. ఈ విషయాన్ని ఆయన తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఇదే సమయంలో నేపాల్‌లో భోటే కోశీ నది ఉద్ధృతంగా ప్రవహించడంతో నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లో భారీ విధ్వంసం చోటుచేసుకుంది. టిబెట్ వైపు నుంచి వచ్చిన ఆకస్మిక వరదలతో పలు గ్రామాలు, వంతెనలు, ప్రాజెక్టులు కొట్టుకుపోయాయి. రసువా జిల్లాలో సుమారు 1,000 మంది వరదల్లో కొట్టుకుపోయినట్లు అధికారులు అంచనా వేస్తుండగా, గల్లంతైన వారిలో 105 మంది భారతీయులు ఉన్నట్లు సమాచారం. వారి ఆచూకీ కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.



## నేపాల్ వరదలతో భారత్ అలర్ట్

- సరిహద్దు జిల్లాల్లో ముందస్తు చర్యలు

నేపాల్‌లో మెరుపు వరదలు బీభత్సం సృష్టిస్తున్న నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. వరదలతో ఇప్పటివరకు 16 మంది మృతి చెందగా, సుమారు 400 మంది గల్లంతైనట్లు స్థానిక అధికారులు అంచనా వేస్తున్నారు. నేపాల్ నుంచి వరద నీరు దిగువకు ప్రవహించే అవకాశం ఉండటంతో బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వాలు సరిహద్దు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాయి. బిహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. డ్యామ్‌లు, కరకట్టలపై 24 గంటల నిఘా పెట్టాలని, రాత్రివేళల్లోనూ పెట్రోలింగ్ కొనసాగించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో లౌడ్‌స్పీకర్ల ద్వారా ప్రజలకు హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే రంగంలోకి దిగేందుకు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. మరోవైపు ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగీ ఆదిత్యనాథ్ కూడా అధికారులను అప్రమత్తం చేశారు. గండక్, నారాయణి నదుల్లో నీటిమట్టాలు పెరుగుతున్నాయని, దీంతో మహారాజ్‌గంజ్, కుషీనగర్ జిల్లాల్లో వరద ముప్పు ఉండొచ్చని తెలిపారు. స్థానిక యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

## నేపాల్ వరదల్లో భారీ నష్టం

- ఆస్తులు, ప్రాణాలపై వరద పంజా

నేపాల్‌లో మెరుపు వరదలు భారీ విధ్వంసం సృష్టించాయి. ప్రాణనష్టంతో పాటు పెద్దఎత్తున ఆస్తి నష్టం జరిగిందని, పలువురు గల్లంతయ్యారని నేపాల్ ఎంబసీ ప్రకటించింది. వరద ఉద్ధృతికి ఇళ్లు, రహదారులు, వంతెనలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పలు హైడ్రోపవర్ ప్రాజెక్టులకు కూడా నష్టం వాటిల్లింది. గల్లంతైన వారి కోసం నేపాల్ భద్రతా బలగాలు విస్తృతంగా సహాయక చర్యలు చేపట్టాయి. దిగువ ప్రాంతాల్లో వరద ముప్పు పొంచి ఉందని ప్రభుత్వం ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సహాయక చర్యలను కొనసాగిస్తున్నట్లు ఎంబసీ తెలిపింది. విదేశీ సాయం అవసరంపై ఖాట్మాండు నుంచి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. భారత్‌తో అవసరమైన సమన్వయానికి సిద్ధంగా ఉన్నామని నేపాల్ వెల్లడించింది. ఇదే సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో ఫోన్‌లో మాట్లాడి వరద పరిస్థితిపై ఆరా తీశారు. ప్రాణనష్టంపై సంతాపం తెలిపిన మోదీ.. భారత్ అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. నేపాల్‌లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

## నేపాల్ వరదలకు కారణమేంటి?

- భూకంపం తర్వాతే ఆకస్మిక వరద

నేపాల్‌లో బీభత్సం సృష్టించిన ఆకస్మిక వరదలకు టిబెట్‌లో సంభవించిన భూకంపమే కారణమై ఉండొచ్చని నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ తెలిపారు. టిబెట్‌లో కొండచరియలు విరిగిపడి భోటే కోశీ నదిలోకి భారీగా నీరు చేరి వరదలకు దారితీసి ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేసినట్లు ఆయన చెప్పారు. టిబెట్‌లో బుధవారం ఉదయం 8.37 గంటలకు 4.4 తీవ్రతతో భూకంపం నమోదైనట్లు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. అదే సమయంలో టిబెట్ గ్యిరోంగ్ పోర్టు ప్రాంతంలో భారీ వరదలు వచ్చిన దృశ్యాలు బయటకు రావడం అనుమానాలను మరింత బలపరిచింది. నేపాల్ విపత్తు నిర్వహణ సంస్థ కూడా చైనా సరిహద్దు సమీపంలో కొండచరియలు, మంచుచరియలు విరిగిపడిన ఆనవాళ్లు శాటిలైట్ చిత్రాల్లో కనిపించినట్లు తెలిపింది. దీంతో వరదలకు అసలు కారణమేంటన్న దానిపై నిపుణులు లోతుగా పరిశీలిస్తున్నారు.

### లేండే నుంచి భోటే కోశీకి ఉద్ధృతి

కాఠ్‌మాండు యూనివర్సిటీ నిపుణుల ప్రకారం లేండే నదికి అడ్డంగా మంచుచరియలు పేరుకుపోవడంతో ఎగువ ప్రాంతంలో భారీగా నీరు నిలిచిపోయి ఉండొచ్చు. ఆ తర్వాత భూకంపం ప్రభావంతో మంచుచరియలు, కొండచరియలు ఒక్కసారిగా కదిలిపడి నీరు భోటే కోశీలోకి పోటెత్తి ఆకస్మిక వరదకు కారణమై ఉండొచ్చని చెబుతున్నారు. లేండే నది టిబెట్‌లో పుట్టి నేపాల్‌లోకి ప్రవేశించిన తర్వాత భోటే కోశీలో కలుస్తుంది. అక్కడి నుంచి నది దిగువకు ప్రవహిస్తూ త్రిశూలీగా మారుతుంది. దేవఘాట్ వద్ద కాళీగండకిలో కలిసి నారాయణి నదిగా భారత్‌లోకి ప్రవేశిస్తుంది. భారత్‌లో దీనినే గండక్ నదిగా పిలుస్తారు. భూకంపం, మంచుచరియలు, కొండచరియలు, భారీ నీటి ప్రవాహం మధ్య పూర్తి సంబంధాన్ని నిర్ధారించేందుకు నేపాల్ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# డీవీ మనోహర్‌పై ఆరోపణల వెనుక కిలేడీ

- రూ. 30 లక్షల కోసం బ్లాక్‌మెయిల్
- లావణ్య అరాచకాల వెనుక అసలు కథ ఇదే!
- నగదు మాయం తర్వాతే ఆరోపణల దుమారం



ఓ ఉద్యోగి చేసిన ఆరోపణలు.. ఓ ప్రముఖ హోటల్‌లో ఒక్కసారిగా కలకలం రేపాయి. అయితే అసలు కథ ఏమిటి? హోటల్ మనోహర్ యాజమాన్యం చెబుతున్న వివరాలు ఇప్పుడు కొత్త ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. సంస్థలో ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ కమ్ గెస్ట్ రిలేషన్స్ మేనేజర్‌గా పనిచేసిన కొరపు లావణ్యపై హోటల్ యాజమాన్యం తీవ్ర ఆరోపణలు చేసింది. రూ.లక్ష నగదు కనిపించకపోవడంపై ప్రశ్నించిన తర్వాతే వివాదం మొదలైందని తెలిపింది. ఆ తర్వాత చైర్మన్ కార్యాలయంలో ఆమె ప్రవర్తన, లాబీలో జరిగిన గందరగోళం, కీలక తాళం చెవులు అప్పగించకపోవడం వంటి అంశాలను యాజమాన్యం ప్రస్తావించింది. అంతేకాదు.. సంస్థ నుంచి రూ.30 లక్షలు డిమాండ్ చేశారంటూ ఆధారాలు ఉన్నాయని వెల్లడించింది.



మరోవైపు తనపై వచ్చిన ఆరోపణలను లావణ్య ఎలా సమర్థించుకుంటారన్నది కూడా ఆసక్తికరంగా మారింది. అసలు రూ.లక్ష నగదు వ్యవహారం ఏంటి? రూ.30 లక్షల డిమాండ్ వెనుక కథేంటి? లావణ్య ఆరోపణలు నిజమా? లేక నగదు వ్యవహారాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నమా? ఇప్పుడు ఈ వివాదం చుట్టూ ఇవే ప్రశ్నలు హాట్ టాపిక్‌గా మారాయి.

### లావణ్య ఆరోపణలన్నీ అవాస్తవాలే

హైదరాబాద్‌లోని హోటల్ మనోహర్ మాజీ ఉద్యోగి కొరపు లావణ్య చేసిన ఆరోపణలు అవాస్తవమని సంస్థ చైర్మన్ డీవీ మనోహర్ స్పష్టం చేశారు. లావణ్య 2025 డిసెంబర్ 1న ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ కమ్ గెస్ట్ రిలేషన్స్ మేనేజర్‌గా సంస్థలో చేరారని తెలిపారు. చైర్మన్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి ఆకస్మిక మరణం తర్వాత 2026 జూలై నుంచి ఆమె చైర్మన్ కార్యాలయంలో విధులు నిర్వహించారని చెప్పారు. ఆగస్టు 17న ఆఫీస్ బ్యాగ్‌లో తీసుకొచ్చిన రూ.లక్ష నగదు కనిపించకుండా పోయిందని మనోహర్ తెలిపారు. కార్యాలయంలోకి ఎవరైనా వచ్చారా అని సిబ్బంది లావణ్యను ఫోన్‌లో అడగగా, ఎవరూ రాలేదని ఆమె సమాధానం ఇచ్చారని చెప్పారు. అనంతరం ఆమె దురుసుగా మాట్లాడటంతోపాటు తనపైనే ఆరోపణలు చేస్తూ అనుచిత సందేశాలు పంపారని పేర్కొన్నారు. ఆగస్టు 19న నగదు విషయంపై ప్రశ్నించగా ఆమె తీవ్ర ఆగ్రహానికి గురై కేకలు వేశారని తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఇద్దరు సీనియర్ మేనేజర్లను పిలిపించి ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చామని మనోహర్ చెప్పారు. అయినా ఆమె హోటల్ లాబీలోకి వెళ్లి అసభ్య పదజాలంతో దూషిస్తూ గందరగోళం సృష్టించారని ఆరోపించారు. ఆమె 100కు ఫోన్ చేయడంతో పోలీసులు అక్కడికి వచ్చారని తెలిపారు. కొన్ని గంటలపాటు ఉద్రిక్త పరిస్థితి కొనసాగిందని, చైర్మన్ కార్యాలయానికి సంబంధించిన కీలక తాళం చెవులను అప్పగించేందుకు ఆమె నిరాకరించి వాటిని తనతో తీసుకెళ్లారని చెప్పారు.

### రూ.30 లక్షల డిమాండ్ ఆరోపణ

హోటల్ నుంచి వెళ్లిన లావణ్య 36 నెలల జీతాన్ని డిమాండ్ చేశారని, ఆ డిమాండ్‌ను సంస్థ తిరస్కరించిందని చైర్మన్ తెలిపారు. జనరల్ మేనేజర్ ఉదయ్ సాహా, సీఎఫ్ఓ సీ చంద్రశేఖర్ ప్రసాద్, డైరెక్టర్ సత్య పింజల, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ శ్రీ శక్తి ప్రిన్సిపాల్ వై. అనిత చంద్రన్ కూడా మీడియా సమావేశంలో మాట్లాడారు. లావణ్య తమ సంస్థ నుంచి దాదాపు రూ.30 లక్షలు డిమాండ్ చేశారని, ఇందుకు సంబంధించిన ఆడియో ఆధారాలు తమ వద్ద ఉన్నాయని వారు తెలిపారు. ఈ డిమాండ్ బ్లాక్‌మెయిలింగ్ కిందకు వస్తుందని ఆరోపించారు. లావణ్య తనపై వచ్చిన ఆరోపణలను పక్కదారి పట్టించేందుకే చైర్మన్, జీఎం, సీఎఫ్ఓ, సీనియర్ మేనేజర్లపై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని సంస్థ ప్రతినిధులు ఆరోపించారు. ఆమె 2026లోనే సంస్థలో చేరారని, మీడియా ముందు చెప్పినట్లు 2023లో చేరలేదని స్పష్టం చేశారు. రూ.లక్ష నగదు వ్యవహారాన్ని పక్కదారి పట్టించేందుకే సంస్థ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరించారని ఆరోపించారు.

### పోష్ కమిటీకి ఫిర్యాదు చేయలేదని వెల్లడి

చైర్మన్ డీవీ మనోహర్ వయసు 73 సంవత్సరాలని, 52 ఏళ్ల సుదీర్ఘ వ్యాపార ప్రస్థానంలో ఆయనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని సంస్థ ప్రతినిధులు తెలిపారు. హోటల్‌కు 30 ఏళ్లకు పైగా చరిత్ర ఉందని, ఇప్పటి వరకు లైంగిక వేధింపులకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు నమోదు కాలేదన్నారు. నిబంధనల ప్రకారం సీనియర్ మహిళా మేనేజర్ నేతృత్వంలో పోష్ కమిటీ పనిచేస్తోందని, అయితే లావణ్య ఆ కమిటీకి ఎలాంటి ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు. చైర్మన్ కార్యాలయానికి సంబంధించిన కీలక తాళం చెవులను లావణ్య తిరిగి ఇవ్వకుండా తనతో తీసుకెళ్లారని హోటల్ యాజమాన్యం ఆరోపించింది. లాబీలో పోలీసులు, సిబ్బంది, అతిథుల సమక్షంలో గందరగోళం సృష్టించడం ద్వారా సంస్థ ప్రతిష్టకు నష్టం కలిగించేందుకు ప్రయత్నించారని పేర్కొంది. లావణ్య చేసిన ఆరోపణలు అవాస్తవమని, నగదు వ్యవహారం బయటపడిన తర్వాతే ఈ వివాదం మొదలైందని హోటల్ యాజమాన్యం తన వాదనను వెల్లడించింది.

# చెన్నైకి కొత్త ఎయిర్‌పోర్ట్

## పరందూర్ ప్రాజెక్ట్‌కు విజయ్ బ్రేక్

చెన్నైకి రెండో విమానాశ్రయం నిర్మించేందుకు ప్రతిపాదించిన పరందూర్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్‌ను తమిళనాడు ప్రభుత్వం రద్దు చేసింది. ముఖ్యమంత్రి విజయ్ ఎన్నికల సమయంలో స్థానికులకు ఇచ్చిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దాదాపు రూ.27 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు కోసం కాంచీపురం, శ్రీపెరుంబుదూర్ ప్రాంతాల్లోని సుమారు 5,369 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఇప్పటికే దాదాపు 1,700 ఎకరాలు సేకరించారు. అయితే ప్రాజెక్టు ప్రతిపాదిత ప్రాంతంలో 47.6శాతం సారవంతమైన సాగుభూమి, సుమారు నాలుగో వంతు చెరువులు, కాలువలు, నీటి వనరులు ఉండటంతో స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. వెయ్యి రోజులకు పైగా రైతులు, గ్రామస్థులు ఆందోళనలు కొనసాగించారు. పర్యావరణానికి నష్టం కలిగించేలా అభివృద్ధి ఉండకూడదని విజయ్ స్పష్టం చేస్తూ.. పరందూర్‌లో విమానాశ్రయానికి తాము అంగీకరించబోమని ప్రకటించారు. పరందూర్ రద్దయినా చెన్నై విమానయాన అవసరాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయబోదని సీఎం విజయ్ తెలిపారు. వ్యవసాయ భూములు, ప్రజల ఇళ్లు, జీవనోపాధికి కనీస నష్టం కలిగే ప్రత్యామ్నాయ ప్రాంతాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. చెన్నై ప్రస్తుత విమానాశ్రయాన్ని తాత్కాలికంగా విస్తరించేందుకు చర్యలు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఉన్న విమానాశ్రయం సామర్థ్యాన్ని 3.5 కోట్ల మంది ప్రయాణికులకు పెంచే ప్రయత్నాలు జరుగుతున్నా, 2028 -2032 మధ్య అది పూర్తిస్థాయిలో నిండి పోయే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. భూమి కొరత, నగర విస్తరణ, రన్‌వే విస్తరణకు పరిమితులు, విమానాల పార్కింగ్ సమస్యలు, అంతర్జాతీయ కార్గో ఒత్తిడి కారణంగా ప్రస్తుత విమానాశ్రయాన్ని మరింత విస్తరించడం కష్టంగా మారింది. రెండో విమానాశ్రయం కోసం రెండు దశాబ్దాలుగా సాగుతున్న అన్వేషణ ఇప్పుడు మళ్లీ మొదటికి చేరింది. పర్యావరణ పరిరక్షణ, ప్రజల ప్రయోజనాలు, చెన్నై భవిష్యత్ విమానయాన అవసరాలను సమతూకం చేస్తూ కొత్త ప్రాంతాన్ని ఎంపిక చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై పడింది.





## అందుబాటులోనే ఉన్నా

### మాజీ ఎమ్మెల్సీ టీడీపీ నేత బత్యాల

సిద్దవటం: అధికారం ఉన్నా లేకున్నా ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను ఎప్పుడూ స్పందిస్తూనే ఉంటానని, క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగుతున్నానని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ సీనియర్ నాయకులు బత్యాల చెంగల్రాయలు అన్నారు. పార్టీపరంగా సమస్యల పరిష్కారం కోసం తనను కలిసే ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. సిద్దవటం మండలంలోని ఏపీఎస్పీ బెటాలియన్ కళ్యాణ మండపంలో జరిగిన పెద్దపల్లి మాజీ ఎంపీటీసీ శ్రీనివాస నాయుడు కుమారుడి వివాహ వేడుకకు బత్యాల చంగల్‌రాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. అనంతరం వివాహ వేడుకకు హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో బత్యాల చంగల్‌రాయుడు మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన రాజకీయ ప్రాధాన్యత అని, పదవులు ఉన్నా లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. పార్టీకి సంబంధించిన సమస్యలపై నాయకులు, కార్యకర్తలు ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ డైరెక్టర్, ఒంటిమిట్ట మండల టీడీపీ నాయకులు కొమర వెంకట నరసయ్య, రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, పార్లమెంట్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు పుత్త రామచంద్రయ్య, మామిళ్ల ఈశ్వరయ్య, మైదుకూరు టీడీపీ నాయకులు రామచంద్రనాయుడు, మాజీ జెడ్పీటీసీ చలమయ్య యాదవ్, రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.




## మిలాదున్ నబీ సందర్భంగా విశ్వశాంతి ర్యాలీ

ప్రొద్దుటూరు, ఆగస్టు 26: మిలాదున్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రొద్దుటూరులో అంజుమన్ అహ్లే ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో విశ్వశాంతి ర్యాలీ ఘనంగా నిర్వహించారు. వేలాది మంది పాల్గొని శాంతి, సౌభ్రాతృత్వ సందేశాన్ని చాటిచెప్పారు. మైదుకూరు రోడ్డులోని నాజీరుల్లా ఫంక్షన్ హాల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ అసార్ షరీఫ్ వరకు ప్రశాంతంగా కొనసాగింది. అనంతరం జరిగిన కార్యక్రమంలో అంజుమన్ అహ్లే ఇస్లాం కమిటీ అధ్యక్షులు, ఏపీ స్టేట్ షేక్ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. వి.ఎస్. ముక్తియార్ మాట్లాడుతూ, మహమ్మద్ ప్రవక్త ద్వారా అల్లాహ్ పవిత్ర ఖురాన్‌ను ప్రపంచానికి అందించారని తెలిపారు. ఖురాన్ మతగ్రంథం మాత్రమే కాదని, మానవాళి జీవనానికి అవసరమైన సూత్రాలను అందిస్తుందని పేర్కొన్నారు. ప్రేమ, గౌరవం, ఔదార్యంతో పరస్పరం మెలగాలని బోధిస్తుందని చెప్పారు. కార్యక్రమానికి సహకరించిన కమిటీ సభ్యులు, మౌలీలు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సెక్రటరీ ఇలియాస్ ఖురేషి, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు కె. ఖలీల్ భాషా కృతజ్ఞతలు తెలిపారు.

## వృక్ష ప్రొద్దుటూరు దిశగా 90 మొక్కలు



ప్రొద్దుటూరు, ఆగస్టు 26: పెన్నా తీరం పచ్చదనంతో కళకళలాడేలా 'వృక్ష ప్రొద్దుటూరు' సంకల్పానికి ప్రొద్దుటూరు ఐక్యవేదిక, సంస్కృతి స్వచ్ఛంద సంస్థలు శ్రీకారం చుట్టాయి. బుధవారం ఎర్రగుంట్ల రోడ్డులోని రెడ్ల కళ్యాణ మండపం ఎదుట నుంచి పెన్నా నది పాత బ్రిడ్జి రోడ్డు ఇరువైపులా 90 మొక్కలను నాటారు. ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ డి. నాగదస్తగిరి రెడ్డి, సంస్కృతి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ టి.డి. వరుణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. గ్లోబల్ వార్మింగ్, పర్యావరణ కాలుష్యం ముప్పును తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని వారు పిలుపునిచ్చారు.

## ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన గద్వాల ఎమ్మెల్యే

### నిరుపేదల సొంతింటి కల నెరవేరుతోందన్న బండ్ల



ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో: ప్రజా పాలన ప్రభుత్వంలో నిరుపేదల సొంతింటి కల నెరవేరుతోందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. లబ్ధిదారుల నూతన గృహప్రవేశ కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఎమ్మెల్యే కానుకలు అందజేశారు. తమ నూతన గృహప్రవేశ వేడుకలకు హాజరై, ఆశీర్వదించిన ఎమ్మెల్యేను లబ్ధిదారులు శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం చింతలకుంట గ్రామానికి చెందిన రమేష్‌రెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

## భూమి విషయంలో న్యాయం చేయండి



ప్రొద్దుటూరు: భూమి వివాదంలో తనకు న్యాయం చేయాలని రాజుపాలెం మండలం వెలవలి గ్రామానికి చెందిన కందుకూరి గౌస్‌పీర్ పోలీసులను కోరారు. బుధవారం ప్రొద్దుటూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ భూముల విషయంలో సోదరులు, తల్లితో వివాదం ఉందన్నారు. కోర్టు తనకు అనుకూలంగా ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చినా, ఈ నెల 9న సోదరుడు హుస్సేన్‌బాషా, అతని కుమారులు హారీఫ్, ఆలీ హుస్సేన్, తమ్ముడి భార్య మహబూబ్‌చాన్, తల్లి బీబీ పొలంలోకి వచ్చి దాడి చేసి, దుర్భాషలాడి సెల్‌ఫోన్ తీసుకెళ్లారని ఆరోపించారు. రాజుపాలెం పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించలేదని, తనపైనే రెండు కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల సమక్షంలో తన భార్యను చెప్పుతో కొట్టినా కేసు నమోదు కాలేదన్నారు. ఏఎస్పీకి ఫిర్యాదు చేసినా, అనంతరం జేసీబీ, ట్రాక్టర్లతో పొలానికి వెళ్లే దారిని దున్నివేశారని ఆరోపించారు. దీంతో వ్యవసాయ పనులకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని గౌస్‌పీర్ కోరారు.



# జెన్‌జీతో కోటంరెడ్డి

## యువతతో మాటామంతి లోకేశ్ ప్రశంసలు

జెన్‌జీ యువత ఆలోచనలు, ఆకాంక్షలను తెలుసుకునేందుకు నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. 'జెన్‌జీ యువతతో మాటామంతి' పేరుతో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని మంత్రి నారా లోకేశ్ అభినందించారు. యువతతో నిరంతరం మమేకమై వారి అభిప్రాయాలను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. యువత ఆశయాల ఆధారంగా వారికి ప్రయోజనం కలిగించే కార్యక్రమాలను రూపొందించాలి అని స్పష్టం చేశారు.

**తరానికి తగ్గ విధానాలపై ఫోకస్**

యువతతో జరగనున్న భావ వినిమయ కార్యక్రమం ఆసక్తికరంగా, ఆలోచనాత్మకంగా ఉంటుందని లోకేశ్ పేర్కొన్నారు. వారి ఆకాంక్షలు, అవసరాలు తెలుసుకునేందుకు నిరంతర సంప్రదింపులు అవసరమన్నారు. లోకేశ్ ఆలోచనలతో స్ఫూర్తి పొంది తర్వాతి తరం ఆలోచనలు, అంచనాలు, ఆశయాలను తెలుసుకునేందుకే జెన్‌జీ సమావేశాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కోటంరెడ్డి తెలిపారు. యువతతో నేరుగా చర్చించి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా భవిష్యత్ కార్యక్రమాలకు మరింత స్పష్టమైన దిశ ఏర్పడుతుందని పేర్కొన్నారు.

## కెనాల్ భూముల ఆక్రమణపై చర్యలు తీసుకుంటాం



ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కెనాల్ పరిధిలోని ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయంటూ ఈ నెల 26న 'నా దేశం' దినపత్రికలో ప్రచురితమైన కథనంపై తహశీల్దార్ సరస్వతి స్పందించారు. నాగపూర్, రేవల్లి వైపు వెళ్లే కెనాల్ ప్రాంతంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా కెనాల్ వెంట భూములను చదును చేసి దుక్కి దున్నుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కెనాల్ నిర్మాణం కోసం ఇప్పటికే పరిహారం పొందిన రైతులు తిరిగి అదే భూముల్లో సాగు చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. అలాంటి పనులను వెంటనే నిలిపివేసేలా చర్యలు చేపడతామని, ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు. 'నా దేశం' కథనంపై అధికారులు స్పందించడం, కెనాల్ భూముల పరిరక్షణకు చర్యలు ప్రారంభించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


తెలుగుదేశం
తేది: 26-08-2026
పత్రికా ప్రకటన
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశానుసారం తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ... శంకర్ యాదవ్ గారిని నియమించడం జరిగింది.
(పల్లా శ్రీనివాసరావు)
రాష్ట్ర అధ్యక్షులు తెలుగుదేశం పార్టీ

## తంబళ్లపల్లె టీడీపీ ఇంచార్జ్‌గా శంకర్ యాదవ్



తంబళ్లపల్లె: అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్‌గా మాజీ ఎమ్మెల్యే జి. శంకర్ యాదవ్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. పార్టీ నాయకత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో నియోజకవర్గ టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. శంకర్ యాదవ్‌కు కీలక బాధ్యతలు అప్పగించడంపై పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు నిర్వహించారు. గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం ఉన్న శంకర్ యాదవ్‌కు నియోజకవర్గంపై మంచి అవగాహన ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇంచార్జ్‌గా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేయడం, ప్రజా సమస్యలపై దృష్టి సారించడం వంటి బాధ్యతలు ఆయనపై ఉండనున్నాయి. రానున్న రోజుల్లో తంబళ్లపల్లెలో టీడీపీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేసేందుకు ఆయన నాయకత్వం కీలకం కానుంది. నియామకంతో పార్టీ శ్రేణులు కొత్త ఉత్సాహంతో ముందుకు సాగేందుకు సిద్ధమవుతున్నాయి.



## మానవత్వానికి మదర్ థెరిస్సా ప్రతీక

### ఎమ్మెల్యే మాలకొండయ్య

చీరాల, ఆగస్టు 26: కరుణామూర్తి, భారతరత్న మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా చీరాల పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో ఉన్న ఆమె విగ్రహానికి ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదర్ థెరిస్సా అనగానే ప్రపంచానికి ముందుగా గుర్తుకొచ్చేది ఆమె కరుణ, అమితమైన ప్రేమ అని అన్నారు. జీవితకాలమంతా పేదలు, అనాథలు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సేవ చేసేందుకే అంకితం చేసిన మహనీయురాలని కొనియాడారు. ఆమె స్థాపించిన 'మిషనరీస్ ఆఫ్ చారిటీ' సంస్థ ద్వారా ప్రపంచవ్యాప్తంగా వేలాది నిరుపేదలకు ఆదరణ లభించిందన్నారు. భారతదేశంలో ఆమెను 'మానవతా తల్లి'గా గౌరవిస్తారని, సేవలకు గుర్తింపుగా నోబెల్ శాంతి బహుమతితో పాటు భారతరత్న లభించిందని గుర్తుచేశారు. మదర్ థెరిస్సా జీవితం ప్రేమ, కరుణ, మానవత్వపు విలువలను నేర్పుతుందని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ వేడుకలు

చీరాల, ఆగస్టు 26: ముస్లింల పవిత్ర పండుగ మిలాద్-ఉన్-నబీ వేడుకలు చీరాల పట్టణంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జన్మదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు, మతపరమైన కార్యక్రమాలు నిర్వహించారు. పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి ఇషా నమాజ్ అనంతరం పలు మసీదుల్లో జాగరణ చేపట్టి, రాత్రంతా ఖురాన్ పఠనం, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రవక్త మహమ్మద్ బోధనలు, ఆయన చూపిన సన్మార్గంపై మతపెద్దలు ప్రసంగించారు. వేడుకల్లో భాగంగా చీరాలలోని మర్కస్ మసీదును విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా కులమతాలకు అతీతంగా నిరుపేదలకు భారీగా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మతపెద్దలు మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ బోధించిన ప్రేమ, కరుణ, సోదరభావం, శాంతి, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి.



## కాపు చైతన్యమే లక్ష్యం.. మావిళ్లకు పగ్గాలు



రాజంపేట: కాపు సామాజికవర్గాన్ని చైతన్యవంతం చేసి, వారి హక్కులు, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని రాజంపేట అసెంబ్లీ కాపు జేఏసీ నూతన అధ్యక్షుడు మావిళ్ల ఈశ్వరయ్య తెలిపారు. రాష్ట్ర కాపు జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస నాయుడు ఆదేశాల మేరకు ఉమ్మడి కడప జిల్లా రాజంపేట అధ్యక్షుడిగా ఈశ్వరయ్య నియమితులయ్యారు. బాధ్యతను పదవిగా కాకుండా సామాజిక బాధ్యతగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. కాపు వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటిపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు చేపడతానన్నారు. యువతను చైతన్యపరిచి సామాజిక అభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని పెంచుతానని చెప్పారు. వెనుకబడిన వర్గాలకు అండగా నిలిచి, కాపుల సమస్యలను సంబంధిత వర్గాల దృష్టికి తీసుకెళ్తానన్నారు. కాపు జేఏసీ ఏ ఒక్క రాజకీయ పార్టీకి పరిమితం కాదని, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలను కలుపుకొని పనిచేస్తామని స్పష్టం చేశారు. వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలకు దూరంగా సామాజిక ప్రయోజనమే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన అమ్మ శ్రీనివాస నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

## గంజాయి అడ్డుకట్ట వేయకుంటే నిరాహార దీక్షలు: రాచమల్లు



ప్రొద్దుటూరు: నియోజకవర్గంలో గంజాయి విక్రయాలు, కల్తీ మద్యం అమ్మకాలను వెంటనే అరికట్టాలని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని, దీనివల్ల యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ఆధ్వర్యంలోనే అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. గంజాయితో పాటు కల్తీ మద్యం విక్రయాలు, వ్యభిచార గృహాల నిర్వహణ పెరిగిందని విమర్శించారు. మత్తు పదార్థాలకు యువత బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం, పోలీసులు తక్షణమే స్పందించి గంజాయి విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. చర్యలు తీసుకోకపోతే వైసీపీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. తనపై విచారణ జరపాలని కూటమి నాయకులు కోరడంపై స్పందిస్తూ, ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు.

## పొట్టిసుబ్బయ్యపాలెం తీరంలో పురాతన ఏకశిలా విగ్రహాలు





వేటపాలెం, ఆగస్టు 26: వేటపాలెం మండలం పొట్టిసుబ్బయ్యపాలెం సముద్ర తీరంలో గత రెండు రోజులుగా అలల ఉద్ధృతి పెరగడంతో శివలింగం, ఇతర ఏకశిలా విగ్రహాలు బయటపడటం స్థానికంగా ఆసక్తికర చర్చకు దారితీసింది. సముద్రం అలలు ముందుకు చొచ్చుకురావడంతో తీరప్రాంతం భారీగా కోతకు గురైంది. దీంతో ఇసుక పొరల కింద దశాబ్దాలుగా దాగి ఉన్న విగ్రహాలు వెలుగులోకి వచ్చాయా? లేక సముద్రం నుంచి కొట్టుకొచ్చి తీరానికి చేరాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అలల ధాటికి ఇసుక పూర్తిగా తొలగిపోవడంతో గతంలో ఎప్పుడూ కనిపించని శిల్పాలు ఒక్కసారిగా ప్రత్యక్షమైనట్లు స్థానికులు చెబుతున్నారు. సముద్రం ఉద్ధృతంగా ఉండటంతో అధికారులు ఇప్పటికే పర్యాటకులు సముద్రం లోకి వెళ్లకుండా ఆంక్షలు విధించారు. విగ్రహాల చారిత్రక నేపథ్యంపై స్పష్టత కోసం రెవెన్యూ, పురావస్తు శాఖ అధికారులు పరిశీలన చేపట్టనున్నారు. నిపుణుల అధ్యయనం అనంతరం అవి పురాతన విగ్రహాలా? సముద్రం నుంచి కొట్టుకొచ్చినవా? అన్నది తేలనుంది.



## స్థానిక సమరానికి రంగం సిద్ధం...

## అధికార పక్షం ధీమా.. ప్రతిపక్షం సవాల్..

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఇవి కూడా రాజకీయ పార్టీలకు అత్యంత ప్రాధాన్యమైన పోరుగా మారనున్నాయి. అయితే స్థానిక ఎన్నికల్లో పార్టీ బలంతో పాటు అభ్యర్థుల వ్యక్తిగత గుర్తింపు, గ్రామస్థాయి ప్రభావం, సామాజిక సమీకరణాలు, ప్రజలతో అనుబంధం వంటి అంశాలు కీలక పాత్ర పోషిస్తాయి. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సన్నాహాలు వేగం పుంజుకోవడంతో రాజకీయ చర్చలు మరింత ఊపందుకున్నాయి. ఎన్నికల యంత్రాంగం సమీక్షలు, ప్రభుత్వ శాఖలతో సమన్వయ సమావేశాలు, పరిపాలనా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. సెప్టెంబర్‌లో తొలి విడత పోలింగ్ జరిగే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తున్నప్పటికీ, అధికారిక షెడ్యూల్‌పై తుది నిర్ణయం ఎన్నికల సంఘం ప్రకటించాల్సి ఉంది. ఇదిలా ఉండగా అధికార పక్షం, ప్రతిపక్షం రెండూ కేడర్‌ను చైతన్యపరుస్తూ, స్థానిక స్థాయిలో వ్యూహాలను సిద్ధం చేస్తున్నాయి. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక ఎన్నికల సమరానికి వేదిక సిద్ధమవుతోంది.

# ప్రతిష్టాత్మకంగా లోకల్ బాడీ ఎన్నికల్లో వైసీపీతో కబడ్డీ

## ఉందిలే... మంచి కాలం.. ముందు ముందునా..! ఊరు వాడా మనవే..!

### • అసలు రాజకీయ సమరం మొదలు

రెండేళ్ల క్రితం అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి సాధించిన విజయం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా నిలిచింది. ఆ ప్రజా తీర్పుతో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో పరీక్షకు రానున్నాయి. రాష్ట్ర స్థాయిలో లభించిన మద్దతు గ్రామాలు, పట్టణాల్లో కూడా కొనసాగుతుందా లేదా అన్నదే ప్రధాన చర్చగా మారింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం చూపుతున్న చొరవ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం వెనుక ప్రజల నుంచి మరోసారి సానుకూల స్పందన లభిస్తుందనే నమ్మకం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ప్రతిపక్షం స్థానిక సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకుని బరిలోకి దిగేందుకు సిద్ధమవుతోంది. దీంతో ఈ ఎన్నికలు కేవలం స్థానిక ప్రతినిధుల ఎంపికకే పరిమితం కాకుండా, రెండేళ్ల ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబించే రాజకీయ పరీక్షగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### • రెండేళ్ల పాలనకు రియల్ టెస్ట్

స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం తన రెండేళ్ల పాలనను ప్రజల ముందుంచే అవకాశంగా చూస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల విస్తరణ, పారిశ్రామిక ప్రాజెక్టులు, సంక్షేమ పథకాల అమలును ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావించే అవకాశం ఉంది. ఇటీవలి సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజాప్రతినిధులకు క్రమశిక్షణ పాటించడం, ప్రజలకు అందుబాటులో ఉండడం, ప్రభుత్వ ప్రతిష్ఠను కాపాడాలని సూచించినట్లు సమాచారం. స్థానిక స్థాయిలో ప్రజాప్రతినిధుల పనితీరే ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తుందనే అంచనాతో పార్టీ యంత్రాంగాన్ని మరింత చురుకుగా చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. గ్రామాల్లో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, స్థానిక నాయకత్వంపై ప్రజల అభిప్రాయం, సామాజిక సమీకరణాలు, కుటుంబాల ప్రభావం వంటి అంశాలు ఓటింగ్‌పై కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది. అందువల్ల ఈ ఎన్నికలు అన్ని ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మక పోరుగా మారనున్నాయని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

### • స్థానిక పోరుతో కూటమికి మరో అగ్నిపరీక్ష

కూటమి దృష్టిలో ఈ ఎన్నికలు మరో కీలక పరీక్ష. రాష్ట్ర స్థాయిలో ఏర్పడిన రాజకీయ ఆధిక్యాన్ని గ్రామస్థాయిలో కూడా నిలబెట్టుకోవాలని అధికార పక్షం లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జిల్లా పరిషత్‌లలో గణనీయమైన ప్రాతినిధ్యం సాధించడం ద్వారా భవిష్యత్ రాజకీయాలకు బలమైన పునాది వేయాలని కూటమి యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ప్రతిపక్షం కూడా ఈ ఎన్నికలను తేలికగా తీసుకోవడం లేదు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీ నిర్మాణాన్ని పునర్వ్యవస్థీకరించడం, కేడర్‌లో ఉత్సాహం నింపడం, ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టడం వంటి కార్యక్రమాలతో తన ఉనికిని బలపరచే ప్రయత్నం చేస్తోంది. స్థానిక ఎన్నికలను తిరిగి ప్రజల్లో బలం నిరూపించుకునే అవకాశంగా చూస్తున్నట్లు రాజకీయ పరిణామాలు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో అభివృద్ధి వర్సెస్ స్థానిక అసంతృప్తి అనే చర్చ కూడా ప్రధాన అంశంగా మారుతోంది. ప్రభుత్వం అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాన అజెండాగా తీసుకెళ్తుంటే, ప్రతిపక్షం స్థానిక సమస్యలు, ధరలు, ఉపాధి, పరిపాలన వంటి అంశాలను ప్రస్తావించే అవకాశం ఉంది. ఏ అంశం ఓటర్లను ఎక్కువగా ప్రభావితం చేస్తుందన్నది ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే కీలక అంశం కానుంది.

### • అభివృద్ధి అజెండాతో ప్రజల్లోకి కూటమి

స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు అనుగుణంగా కూటమి ప్రచార వ్యూహాన్ని రూపొందిస్తున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కోస్తాంధ్రలో అమరావతి రాజధాని, ఉత్తరాంధ్రలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, రాయలసీమలో పారిశ్రామిక పెట్టుబడులు, సోలార్ ప్రాజెక్టులు, తయారీ రంగ విస్తరణ వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్తోంది. మరోవైపు గ్రామస్థాయిలో సామాజిక సమీకరణాలు, స్థానిక నాయకుల ప్రభావం, అభ్యర్థుల ఎంపిక, కూటముల రాజకీయాలు ఎన్నికల పోరును మరింత ఉత్కంఠభరితంగా మార్చే అవకాశం ఉంది. ముఖ్యంగా రాయలసీమలో సంప్రదాయ రాజకీయ పోటీ మరోసారి ఆసక్తిని రేకెత్తించే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ ఎన్నికలు కేవలం స్థానిక ప్రతినిధుల ఎంపికకే పరిమితం కావు. రెండేళ్ల ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబించే అవకాశమూ ఉంది. అధికార పక్షానికి పాలనపై విశ్వాసాన్ని బలపరిచే అవకాశం కాగా, ప్రతిపక్షానికి తన బలాన్ని పునరుద్ధరించుకునే వేదికగా మారనుంది. చివరికి ప్రజలు కొనసాగింపునకు మద్దతిస్తారా, లేక కొత్త రాజకీయ సంకేతాన్ని ఇస్తారా అన్నదే ప్రధాన ఆసక్తిగా మారింది.

### • అభివృద్ధి అజెండా... రాజకీయ అస్త్రమా?

స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రాంతాల వారీ ప్రచార వ్యూహానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. గత రెండేళ్లలో తీసుకున్న విధాన నిర్ణయాలు, ప్రారంభించిన అభివృద్ధి పనులు, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల విస్తరణను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది. రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందనే సందేశాన్ని గ్రామస్థాయికి చేర్చడమే అధికార పక్షం ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. కోస్తాంధ్రలో అమరావతి రాజధాని అభివృద్ధిని ప్రచారంలో కీలక అంశంగా ప్రస్తావించే అవకాశం ఉంది. రాజధాని నిర్మాణ పనులు వేగం పుంజుకోవడం, రహదారులు, ప్రభుత్వ భవనాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి రాష్ట్ర పురోగతికి సంకేతంగా ప్రభుత్వం వివరిస్తోంది. అమరావతి ద్వారా పెట్టుబడులు, ఉపాధి, విద్య, వైద్యం, సేవారంగాలకు ఊతం లభిస్తుందనే వాదనను ప్రజల్లో బలంగా వినిపిస్తోంది. ఈ ప్రచారం కోస్తా జిల్లాల ఓటర్లపై ఎంత ప్రభావం చూపుతుందన్నది స్థానిక ఎన్నికల ఫలితాల్లో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

### • ఉత్తరాంధ్రలో భోగాపురం... భవిష్యత్‌పై ఆశలు

ఉత్తరాంధ్రలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రభుత్వ అభివృద్ధి అజెండాలో కీలక ప్రాజెక్టుగా నిలుస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పరిశ్రమలు, పర్యాటకం, సేవారంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడతాయని ప్రభుత్వం చెబుతోంది. విశాఖపట్నం ఆర్థిక కార్యకలాపాలను విస్తరించే కేంద్రంగా భోగాపురాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తోంది. విమానాశ్రయం చుట్టూ పెట్టుబడులు పెరగడం, ఉపాధి అవకాశాలు విస్తరించడం, మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందడం ద్వారా ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందనే ప్రచారం సాగుతోంది. స్థానిక ఎన్నికల్లో ఇలాంటి భారీ ప్రాజెక్టులు నేరుగా ఓటర్ల నిర్ణయాన్ని ఎంతవరకు ప్రభావితం చేస్తాయో ఎన్నికల తర్వాతే స్పష్టత వస్తుంది. అయితే ప్రాంత భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతోందనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో భోగాపురం ప్రాజెక్టు ప్రధాన ప్రచార అస్త్రంగా మారే అవకాశం కనిపిస్తోంది.

### • రాయలసీమ... ఎన్నో ఏళ్ల ఎదురుచూపులకు సమాధానమా?

రాయలసీమ రాజకీయాల్లో అభివృద్ధి అంశం ఎప్పుడూ కీలకంగా ఉంటుంది. పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులు, ఉపాధి అవకాశాలు, పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలే ప్రజల అంచనాలను నిర్ణయిస్తుంటాయి. ప్రస్తుతం జొన్నగిరి బంగారు గనులు, భారీ సోలార్ పార్కులు, కడపలో ప్రతిపాదిత పారిశ్రామిక పెట్టుబడులు, తయారీ రంగ సంస్థలు, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి ప్రాజెక్టులను ప్రభుత్వం అభివృద్ధి సూచికలుగా ప్రచారం చేస్తోంది. ఇవి పూర్తిస్థాయిలో అమలుకు సమయం అవసరమైనప్పటికీ, ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం కనిపిస్తోంది. మరోవైపు కర్నూలును న్యాయ రాజధానిగా అభివృద్ధి చేస్తామన్న హామీ కూడా చర్చనీయాంశంగా మారింది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రాజెక్టులు ఎంత మేరకు కార్యరూపం దాల్చుతాయి, ప్రజల విశ్వాసాన్ని ఎంతగా పొందుతాయన్నదే రాబోయే రాజకీయ చర్చల్లో కీలక అంశంగా నిలిచే అవకాశం ఉంది.

### • స్థానిక ఎన్నికల్లో అభివృద్ధి ఒక్కటే సరిపోతుందా?

ఇటీవలి కాలంలో ప్రభుత్వం విదేశీ పెట్టుబడులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ముఖ్యంగా పరిశ్రమలను రాష్ట్రానికి ఆకర్షించడం, తయారీ రంగాన్ని విస్తరించడం, ఉద్యోగ అవకాశాలను పెంచడం వంటి లక్ష్యాలతో వివిధ దేశాల్లో పెట్టుబడిదారులతో సమావేశాలు నిర్వహించింది. అయితే పెట్టుబడుల ప్రకటనలు ఒకవైపు ఉండగా, అవి ఎప్పుడు అమలులోకి వస్తాయి? ఎంత మేరకు ఉపాధి కల్పిస్తాయి? అనే ప్రశ్నలను ప్రతిపక్షం లేవనెత్తే అవకాశం ఉంది. అందువల్ల పెట్టుబడుల అంశం ఎన్నికల్లో రెండు వైపులా చర్చకు దారితీసే అవకాశం ఉంది. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం స్థానిక ఎన్నికల్లో అభివృద్ధి ముఖ్యమైన అంశమే అయినా, అది ఒక్కటే నిర్ణయాత్మక అంశం కాదు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, సంక్షేమ పథకాల అమలు, స్థానిక నాయకుల ప్రవర్తన, సామాజిక సమీకరణాలు కూడా ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. అందుకే అధికార పక్షం ఒకవైపు రాష్ట్ర స్థాయి అభివృద్ధి కథనాన్ని వినిపిస్తూనే, మరోవైపు గ్రామస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్లు కనిపిస్తోంది.

### • 2029కు తొలి రాజకీయ సంకేతం?

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అంతర్గత సమన్వయం కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య అభ్యర్థుల ఎంపిక, స్థానాల సర్దుబాటు, కార్యకర్తల సమన్వయం విజయాన్ని ప్రభావితం చేసే అంశాలుగా మారనున్నాయి. స్థానిక అసంతృప్తిని సమర్థంగా ఎదుర్కొంటే కూటమికి ప్రయోజనం కలిగే అవకాశం ఉండగా, విభేదాలు పెరిగితే ప్రత్యర్థులకు అవకాశం లభించవచ్చు. మరోవైపు వైసీపీ గ్రామస్థాయి నాయకత్వం, కార్యకర్తల నెట్‌వర్క్, స్థానిక సమస్యలను ప్రధాన అస్త్రాలుగా చేసుకుని పోటీకి సిద్ధమవుతోంది. రాజకీయ పరిశీలకుల అభిప్రాయం ప్రకారం స్థానిక ఎన్నికలు 2029 అసెంబ్లీ ఎన్నికలకు ముందస్తు సంకేతాలను ఇచ్చే అవకాశముంది. రాష్ట్రవ్యాప్త రాజకీయ ప్రభావం ఉన్నప్పటికీ, గ్రామాల్లో అభ్యర్థి వ్యక్తిత్వం, ప్రజలతో అనుబంధం, సమస్యల పరిష్కారంలో చొరవ, సామాజిక సమీకరణాలు ఫలితాలపై గణనీయ ప్రభావం చూపుతాయి. అందుకే ఈ ఎన్నికలను ప్రజల రాజకీయ మనోభావాలను అత్యంత స్పష్టంగా ప్రతిబింబించే ప్రజాస్వామ్య పరీక్షగా అన్ని పార్టీలు భావిస్తున్నాయి.

### • మూడు ప్రాంతాలు మూడు రాజకీయ వ్యూహాలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పక్షం, ప్రతిపక్షం భిన్న అజెండాలతో ప్రజల ముందుకు వెళ్లే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, పెట్టుబడులు, సంక్షేమ పథకాలను ప్రధానంగా ప్రస్తావిస్తుండగా, ప్రతిపక్షం ధరలు, ఉపాధి, స్థానిక సమస్యలు, పరిపాలనపై దృష్టి సారించే అవకాశం ఉంది. కూటమి విజయానికి టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య సమన్వయం, అభ్యర్థుల ఎంపిక, స్థానిక నాయకత్వం కీలకంగా మారనుండగా, ప్రతిపక్షం గ్రామస్థాయి కేడర్‌ను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టింది. మరోవైపు రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రలో రాజకీయ పరిస్థితులు భిన్నంగా ఉండటంతో అన్ని పార్టీలు ప్రాంతాల వారీ వ్యూహాలను అమలు చేసే అవకాశముంది. స్థానిక సమస్యలు, సామాజిక సమీకరణాలు, ప్రజాప్రతినిధుల పనితీరు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలను ఓటర్లు పరిశీలించే అవకాశం ఉంది. ఈ ఎన్నికల ఫలితాలు గ్రామస్థాయి ఆధిపత్యాన్నే కాకుండా 2029 అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీల బలాబలాలను అంచనా వేసే కీలక సూచికగా మారే అవకాశముందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

### • స్థానిక ఎన్నికలు రాష్ట్ర రాజకీయాలకు దిక్సూచి

స్థానిక సంస్థల ఎన్నికలు ఈసారి సాధారణ ఎన్నికలుగా కనిపించడం లేదు. ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాల అమలు, ప్రజాప్రతినిధుల పనితీరు, ప్రతిపక్ష వ్యూహం వంటి అంశాలకు ఇవి కీలక పరీక్షగా మారనున్నాయి. అధికార పక్షం అభివృద్ధిని ప్రధాన అజెండాగా ముందుకు తీసుకెళ్తుండగా, ప్రతిపక్షం స్థానిక సమస్యలు, ఉపాధి, ధరలు, పరిపాలనపై దృష్టి సారించే అవకాశం ఉంది. ఈ రెండు కథనాల్లో ఏది ఓటర్లను ఎక్కువగా ఆకట్టుకుంటుందో అదే ఫలితాలపై ప్రభావం చూపనుంది. గ్రామాలు, పట్టణాల్లో ప్రచారం వేగం పుంజుకోనున్న నేపథ్యంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కే సూచనలు కనిపిస్తున్నాయి. ఇంటింటి ప్రచారం, ప్రజా సమావేశాలు, హామీలు, విమర్శలు ఎన్నికల ప్రధాన అస్త్రాలుగా మారనున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు స్థానిక సంస్థల పాలనకే పరిమితం కాకుండా రాష్ట్ర రాజకీయాలపై కూడా ప్రభావం చూపే అవకాశముంది. ముఖ్యంగా 2029 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజల మనోభావాలను అంచనా వేసే తొలి రాజకీయ సూచికగా ఈ ఎన్నికలను అన్ని పార్టీలు భావిస్తున్నాయి. చివరికి ప్రజల తీర్పే భవిష్యత్ రాజకీయాల దిశను నిర్ణయించనుంది.

## ఇంకా చాలా ఉంది!

### 1. రెండేళ్ల పాలనకు అసలైన ప్రజా పరీక్ష

స్థానిక సంస్థల ఎన్నికలు కూటమి ప్రభుత్వానికి కీలక రాజకీయ పరీక్షగా మారనున్నాయి. రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, పరిపాలనపై ప్రజల అభిప్రాయం ఈ ఎన్నికల్లో ప్రతిబింబించే అవకాశం ఉంది. రాష్ట్రస్థాయిలో వచ్చిన విజయాన్ని గ్రామస్థాయిలో కూడా కొనసాగించగలదా అన్నది అధికార పక్షానికి ప్రధాన సవాల్‌గా మారింది.

### 2. అభివృద్ధి వర్సెస్ ప్రజా సమస్యల పోటీ

అధికార పక్షం అమరావతి, భోగాపురం విమానాశ్రయం, రాయలసీమ పారిశ్రామిక ప్రాజెక్టులు, పెట్టుబడులను ప్రచార అస్త్రంగా వినియోగించనుంది. మరోవైపు ప్రతిపక్షం ధరలు, ఉపాధి, స్థానిక సమస్యలు, పరిపాలనా లోపాలను ప్రజల ముందుకు తీసుకెళ్లే వ్యూహంతో బరిలోకి దిగనుంది. ఏ కథనం ఓటర్లను ప్రభావితం చేస్తుందన్నదే ఫలితాలను నిర్ణయించనుంది.

### 3. మూడు ప్రాంతాలకు మూడు ప్రత్యేక వ్యూహాలు

కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర, రాయలసీమ రాజకీయ పరిస్థితులు భిన్నంగా ఉండటంతో అన్ని పార్టీలు ప్రాంతాల వారీ ప్రచారానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. అమరావతి, భోగాపురం, పారిశ్రామికాభివృద్ధి వంటి అంశాలను ఆయా ప్రాంతాల్లో ప్రధానంగా ప్రస్తావించే అవకాశం ఉంది. స్థానిక సమస్యలు, సామాజిక సమీకరణాలు కూడా ఎన్నికల్లో కీలక పాత్ర పోషించనున్నాయి.

### 4. కూటమి సమన్వయం... ప్రతిపక్షానికి అవకాశమా?

టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య సమన్వయం, అభ్యర్థుల ఎంపిక, స్థానిక అసంతృప్తిని నియంత్రించడం కూటమికి కీలకంగా మారనుంది. మరోవైపు వైసీపీ గ్రామస్థాయి కేడర్, స్థానిక నాయకత్వం, ప్రజా సమస్యలను ఆధారంగా చేసుకుని బలంగా పోటీ ఇవ్వాలని చూస్తోంది. ఈ వ్యూహాల అమలే ఎన్నికల పోరును మరింత ఆసక్తికరంగా మార్చే అవకాశం ఉంది.

### 5. 2029 రాజకీయాలకు తొలి సంకేతం

ఈ ఎన్నికలు స్థానిక సంస్థలకే పరిమితం కావు. 2029 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజల రాజకీయ మనోభావాలను అంచనా వేసే కీలక సూచికగా వీటిని అన్ని పార్టీలు చూస్తున్నాయి. అధికార పక్షానికి ప్రజా మద్దతు కొనసాగుతుందా, ప్రతిపక్షం తిరిగి బలం పుంజుకుంటుందా అన్న దానికి ఈ ఫలితాలు దిశానిర్దేశం చేసే అవకాశముంది.




లైంగికత మనిషి సహజ స్వభావం. ఆకర్షణ సహజం. సంబంధం సహజం. కానీ సమ్మతి లేకపోతే? అక్కడి నుంచే హద్దులు మొదలవుతాయి. అధికారం చేతిలో ఉన్నవాడు ఆ హద్దును చెరిపేస్తే అది వ్యక్తిగత వ్యవహారం కాదు. ప్రజా నమ్మకానికి జరిగిన ద్రోహం. రెండు రాష్ట్రాల రాజకీయాల్లో తరచూ వినిపిస్తున్న లైంగిక ఆరోపణల వెనుక అసలు సమస్య ఏమిటి? నాయకుల వ్యక్తిగత ప్రవర్తనా? అధికార మత్తా? లేక సమాజం పెంచుతున్న మౌన సంస్కృతా?... తెల్లారితే ఒక ఆరోపణ... పొద్దుపోతే మరో వివాదం! సమాజం మారుతోంది. కాలం మారుతోంది. సాంకేతికత పరుగులు తీస్తోంది. మనిషి జీవన విధానం మారుతోంది. కానీ ఒక విషయం మాత్రం మారాల్సినంతగా మారలేదు. అది లైంగికతపై మన అవగాహన. ఒకప్పుడు లైంగికత గురించి మాట్లాడటమే నేరంగా భావించిన సమాజం ఇప్పుడు సోషల్ మీడియా యుగంలోకి వచ్చింది. మొబైల్ ఫోన్ చేతిలో ఉంది. వీడియో కాల్స్ ఉన్నాయి. మెసేజింగ్ యాప్స్ ఉన్నాయి. వ్యక్తిగత సంబంధాలు బహిరంగ చర్చలుగా మారుతున్నాయి. అయినా సమ్మతి అంటే ఏమిటి? వ్యక్తిగత హద్దు అంటే ఏమిటి? అధికారం లైంగిక సంబంధాలపై ఎలా ప్రభావం చూపుతుంది? బలవంతం ఎక్కడ మొదలవుతుంది? వేధింపు ఎక్కడ ముగుస్తుంది? ఈ ప్రశ్నలకు సమాజం ఇంకా పూర్తి సమాధానాలు నేర్చుకోలేదు. అందుకే ప్రతి కొన్ని రోజులకు ఒక కొత్త వివాదం. ఒక ఆరోపణ. ఒక వీడియో. ఒక పోలీసు కేసు. ఒక పార్టీ విచారణ. ఒక సస్పెన్షన్. తర్వాత మరో వివాదం. ఇది కేవలం రాజకీయ వార్త కాదు. ఇది సామాజిక ఆరోగ్యానికి సంబంధించిన అంశం.

# కుర్చీ కవచం కాదు... !
# కామానికి లైసెన్స్ కాదు..!!

## ‘మనోడు’ అనే ముద్ర తొలగాలి

రాజకీయ పార్టీల్లో అత్యంత ప్రమాదకరమైన సంస్కృతి ‘మనోడు కాబట్టి కాపాడాలి’ అనే భావన. మనోడు అయితే? విచారణ ఉండకూడదా? ప్రశ్నించకూడదా? చట్టం పనిచేయకూడదా? ఇదే సంస్కృతి క్రమంగా రాజకీయ వ్యవస్థను నైతికంగా బలహీనపరుస్తుంది. పార్టీ తన నాయకుడిని రక్షించడానికి ముందుకు రావడం కంటే నిజాన్ని రక్షించడానికి ముందుకు రావాలి. మహిళను ప్రశ్నించే సమాజం మారాలి. లైంగిక వేధింపుల కేసుల్లో ప్రస్తుత సమాజానికి ఒక విచిత్రమైన అలవాటు ఉంది. ముందుగా నిందితుడిని కాకుండా బాధితురాలిని ప్రశ్నిస్తుంది. “అక్కడికి ఎందుకు వెళ్లావు?” “అతనితో ఎందుకు మాట్లాడావు?” “రాత్రి ఎందుకు వెళ్లావు?” “అతనితో ఇంతకాలం ఎందుకు పరిచయం?” “ముందే ఎందుకు చెప్పలేదు?” ఇలాంటి ప్రశ్నలు బాధితురాలిని మరింత మానసిక ఒత్తిడికి గురిచేస్తాయి. అసలు ప్రశ్న ఆమె సమ్మతి ఇచ్చిందా? అనేదే.

## లైంగిక ఆరోపణల నీడలో ప్రజాప్రతినిధులు

**• సెక్స్ అంటే శరీరం మాత్రమే కాదు!**

సెక్సాలజీని చాలామంది ఇప్పటికీ కేవలం లైంగిక చర్యల అధ్యయనంగా భావిస్తారు. కానీ లైంగికత అంతకంటే విస్తృతమైనది. మనిషి ఆకర్షణ, భావోద్వేగం, సంబంధాలు, స్వీయ గౌరవం, శారీరక స్వాతంత్ర్యం, లైంగిక గుర్తింపు, పరస్పర గౌరవం, సమ్మతి... ఇవన్నీ దాని పరిధిలోకి వస్తాయి. అందులో అత్యంత ముఖ్యమైనది సమ్మతి. సంబంధం ఉన్నా సమ్మతి అవసరం. పరిచయం ఉన్నా సమ్మతి అవసరం. ప్రేమ ఉందన్నా సమ్మతి అవసరం. వివాహం అయినా సమ్మతి అవసరం. పదవి ఉన్నా సమ్మతి అవసరం. అధికారం ఉన్నా సమ్మతి అవసరం. ‘లేదు’ అంటే లేదు. ఈ చిన్న వాక్యాన్ని సమాజం ఎంత త్వరగా అర్థం చేసుకుంటే అంత మంచిది. వయసు పెరుగుతుంది... ఆకర్షణకు పరిమితి ఉండదు. “ఈ వయసులో ఇవేం పనులు?” అని మనం తరచూ అంటుంటాం. కానీ లైంగిక ఆకర్షణకు వయసు ఒకే ప్రమాణం కాదు. మనిషి వృద్ధుడయ్యాడని భావోద్వేగాలు అంతరించిపోవు. యువతలో ఆకర్షణ ఉంటుంది. మధ్య వయసులో ఉంటుంది. వృద్ధాప్యంలో కూడా ఉండవచ్చు. ఇది మానవ సహజత్వంలో భాగం. అందుకే సమస్య వయసు కాదు. సమస్య ప్రవర్తన. ఆకర్షణ తప్పు కాదు. కోరిక తప్పు కాదు. ఇష్టపడటం తప్పు కాదు. సంబంధం పెట్టుకోవడం తప్పు కాదు. కానీ ఎదుటివారి ఇష్టాన్ని పట్టించుకోకపోవడం తప్పు. బలవంతం చేయడం తప్పు. బెదిరించడం తప్పు. అధికారాన్ని ఉపయోగించడం తప్పు. గోప్యతను ఉల్లంఘించడం తప్పు.

**• అధికారంతో మనిషి మారిపోతాడా?**

ఇదే ఇపుడు అసలు ప్రశ్న. ఒక సాధారణ వ్యక్తి ఒక మహిళను వేధిస్తే ఆమె పోలీసులను ఆశ్రయించవచ్చు. కానీ అదే ఆరోపణ ఒక ప్రభావశీల రాజకీయ నాయకుడిపై వస్తే పరిస్థితి ఎలా ఉంటుంది? అతనికి అనుచరులు ఉంటారు. పార్టీ ఉంటుంది. అధికారులతో పరిచయాలు ఉంటాయి. ఆర్థిక శక్తి ఉంటుంది. సామాజిక ప్రభావం ఉంటుంది. అతని చుట్టూ ఒక రక్షణ వలయం ఉంటుంది. అక్కడే ‘పవర్ డైనమిక్స్’ అనే అంశం వస్తుంది. అధికారంలో ఉన్న వ్యక్తి, తనకంటే బలహీన స్థితిలో ఉన్న వ్యక్తితో సంబంధం పెట్టుకున్నప్పుడు ఆ సంబంధంలో స్వేచ్ఛాయుత సమ్మతి ఎంతవరకు ఉందనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఉద్యోగం పోతుందనే భయం ఉంటే? పదవి ఉపయోగించి బదిలీ చేస్తారనే భయం ఉంటే? కుటుంబాన్ని ఇబ్బంది పెడతారనే బెదిరింపు ఉంటే? రాజకీయంగా నష్టపరుస్తారనే భయం ఉంటే? అప్పుడు ‘అవును’ అనే మాట నిజంగా స్వేచ్ఛాయుతమైనదేనా? ఇదే అధికార సంబంధాల అసలు సంక్లిష్టత.

**• ఆదిమూలం వ్యవహారమో పాఠం**

సత్యవేడు ఎమ్మెల్యే కొనేటి ఆదిమూలంపై ఒక మహిళా టీడీపీ నాయకురాలు లైంగిక దాడికి సంబంధించిన ఆరోపణలు చేయడం తీవ్ర రాజకీయ చర్చకు దారితీసింది. ఆరోపణలు తీవ్రంగా ఉండటంతో టీడీపీ ఆయనను సస్పెండ్ చేసినట్లు అప్పట్లో వార్తలు వెలువడ్డాయి. అయితే ఆదిమూలం ఆరోపణలను ఖండిస్తూ తనపై కుట్ర జరిగిందని పేర్కొన్నారు. ఇక్కడ మనం గుర్తుంచుకోవాల్సింది ఒక్కటే. ఆరోపణ అంటే తీర్పు కాదు. అదే సమయంలో ఆరోపణ అంటే పట్టించుకోనవసరం లేని విషయం కూడా కాదు. నిజం బయటకు రావాలంటే విచారణ జరగాలి. బాధితురాలికి తన వాదన చెప్పే అవకాశం ఉండాలి. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి తన వాదన చెప్పే అవకాశం ఉండాలి. సాక్ష్యాలను పరిశీలించాలి. చివరికి న్యాయ వ్యవస్థ నిర్ణయించాలి.

**• అరవ శ్రీధర్ కేసు మరో ప్రశ్న**

రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై ఒక ప్రభుత్వ ఉద్యోగిని లైంగిక వేధింపులు, బలవంతం, బెదిరింపులకు సంబంధించిన ఆరోపణలు చేయడం రాజకీయ చర్చకు దారితీసింది. ఆమె పలుమార్లు తనను వేధించారని ఆరోపించగా, శ్రీధర్ ఆరోపణలను రాజకీయ కుట్రగా కొట్టిపారేశారు. ఈ వ్యవహారంపై జనసేన అంతర్గతంగా విచారణ కమిటీ ఏర్పాటు చేసింది. పోలీసు కేసు కూడా నమోదైనట్లు వార్తా నివేదికలు వెలువడ్డాయి. పార్టీ పరమైన చర్యల ఫలితం ఏమో గానీ.. ఇక్కడ మరో ముఖ్యమైన విషయం కనిపిస్తుంది. పార్టీ విచారణ, పోలీసు దర్యాప్తు, కోర్టు తీర్పు... మూడు వేర్వేరు ప్రక్రియలు. పార్టీ కమిటీ ఒక నిర్ణయం తీసుకోవచ్చు. పోలీసులు ఆధారాలు సేకరించవచ్చు. కోర్టు మాత్రం సాక్ష్యాల ఆధారంగా తుది నిర్ణయం చెబుతుంది. అందుకే రాజకీయ కథనంలోనూ, మీడియా కథనంలోనూ ఈ తేడాను కచ్చితంగా పాటించాలి.

**• గోరంట్ల మాధవ్... డిజిటల్ పాఠం**

డిజిటల్ ప్రపంచం వ్యక్తిగత జీవితానికి కొత్త సవాళ్లు తెచ్చింది. వీడియో కాల్. వాట్సాప్. స్క్రీన్‌షాట్. రికార్డింగ్. ఫోటో. వీడియో. ఒక్క క్లిక్‌తో ప్రపంచమంతా. ఒకప్పుడు వ్యక్తిగతంగా ఉండే విషయాలు ఇప్పుడు క్షణాల్లో వైరల్ అవుతున్నాయి. కానీ ఇక్కడ మరో ప్రమాదం ఉంది. ప్రతి వైరల్ వీడియో నిజం కాదు. మార్ఫింగ్ ఉంది. డీప్‌ఫేక్ ఉంది. ఎడిటింగ్ ఉంది. తప్పుడు కాంటెక్స్ట్ ఉంది. అందుకే డిజిటల్ ఆధారాలను కూడా శాస్త్రీయంగా పరీక్షించాలి. అదే సమయంలో నిజమైన బాధితుల డిజిటల్ గోప్యతను కాపాడాలి. వైరల్ చేయడం న్యాయం కాదు. విచారణ చేయడం న్యాయం. తెలంగాణలో కూడా ప్రజాప్రతినిధులపై మహిళలకు సంబంధించిన వివాదాలు వెలుగులోకి వచ్చాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్‌కు సంబంధించిన ఒక మహిళతో వివాదం, దుర్భాషలు, బెదిరింపులకు సంబంధించిన ఆరోపణలు వార్తల్లో నిలిచాయి. మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై మహిళ లైంగిక వేధింపుల ఆరోపణలు చేసినట్లు మీడియా కథనాలు వచ్చాయి. ఈ కేసుల్లోనూ అదే సూత్రం. ఆరోపణలను విచారించాలి. కానీ ఆరోపణల ఆధారంగా ముందుగానే తీర్పు ఇవ్వకూడదు.

**• పార్టీ మారితే నైతికత మారుతుందా?**

అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ ఎన్నికల అఫిడవిట్లను విశ్లేషిస్తూ మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు ఎదుర్కొంటున్న పలువురు ప్రస్తుత ఎంపీలు, ఎమ్మెల్యేల వివరాలను వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 21 మంది ప్రస్తుత ఎంపీ, ఎమ్మెల్యేలపై మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నట్లు ఏడీఆర్ విశ్లేషణలో పేర్కొంది. ఇది చూసి వారందరినీ నేరస్థులుగా ముద్ర వేయడం చట్టబద్ధంగా సరైనది కాదు. కానీ ప్రజాస్వామ్యానికి ఇది ఒక హెచ్చరిక. ఎందుకంటే ప్రజలను రక్షించాల్సిన వ్యవస్థలో భాగమైన వ్యక్తులపై మహిళల భద్రతకు సంబంధించిన కేసులు ఉండటం ఎందుకు? ఈ ప్రశ్నకు రాజకీయ పార్టీలు సమాధానం చెప్పాలి. ఇక్కడే అసలు రాజకీయ వైరుధ్యం.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు... “మహిళలకు న్యాయం కావాలి!” అధికారంలో ఉన్నప్పుడు “ఇది రాజకీయ కుట్ర!” అధికారంలో ఉన్నప్పుడు “నిందితుడిపై కఠిన చర్యలు!” తమ పార్టీ నేతపై ఆరోపణ వస్తే... “విచారణ పూర్తయ్యే వరకు మాట్లాడకండి!” అనేటువంటి ఈ ద్వంద్వ వైఖరి ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. నైతికతకు పార్టీ రంగు ఉండకూడదు. టీడీపీ అయినా... జనసేన వైసీపీ బీఆర్ఎస్ బీజేపీ. ఏ పార్టీ అయినా ఒకే ప్రమాణం పాటించాలి.

**• ప్రజాప్రతినిధికి వ్యక్తిగతం ఉండదా?**

అదే సమయంలో సమాజం మరో వైపు కూడా చూడాలి. తప్పుడు ఆరోపణలు కూడా వ్యక్తుల జీవితాలను నాశనం చేయగలవు. ప్రతిష్ట దెబ్బతినవచ్చు. కుటుంబం ప్రభావితమవుతుంది. రాజకీయ భవిష్యత్తు నాశనం కావచ్చు. అందుకే న్యాయం అంటే ఒక వైపు మాత్రమే చూడటం కాదు. నిజాన్ని కనుగొనడం. అదే న్యాయం. బాధితురాలి హక్కులను కాపాడాలి. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి హక్కులను కూడా కాపాడాలి. ఉండాలి. ఖచ్చితంగా ఉండాలి. ప్రజాప్రతినిధి కూడా మనిషే. అతనికీ భావోద్వేగాలు ఉంటాయి. వ్యక్తిగత సంబంధాలు ఉండవచ్చు. ప్రేమ ఉండవచ్చు. వివాహం ఉండవచ్చు. వివాహేతర సంబంధాలపై నైతిక అభిప్రాయాలు సమాజానికి వేర్వేరుగా ఉండవచ్చు. కానీ చట్టపరమైన ప్రశ్న వేరే. సమ్మతి ఉందా? బలవంతం ఉందా? బెదిరింపు ఉందా? అధికార దుర్వినియోగం జరిగిందా? మోసం జరిగిందా? వ్యక్తిగత గోప్యత ఉల్లంఘించబడిందా? ఇలాంటి ప్రశ్నలే ముఖ్యమైనవి.

**• నాయకులకు లైంగిక నైతికత?**

రాజకీయ పార్టీల్లో ఎన్నికల శిక్షణ ఉంటుంది. బూత్ మేనేజ్‌మెంట్ శిక్షణ ఉంటుంది. సోషల్ మీడియా శిక్షణ ఉంటుంది. ప్రచార వ్యూహాలపై వర్క్‌షాప్‌లు ఉంటాయి. కానీ లైంగిక నైతికతపై శిక్షణ ఎక్కడ? సమ్మతి అంటే ఏమిటి? వర్క్‌ప్లేస్ హరాస్మెంట్ అంటే ఏమిటి? పవర్ డైనమిక్స్ అంటే ఏమిటి? డిజిటల్ ప్రైవసీ అంటే ఏమిటి? మహిళా కార్యకర్తలతో ఎలా వ్యవహరించాలి? ఇలాంటి అంశాలపై ప్రతి పార్టీ శిక్షణ ఇవ్వాలి.

లైంగిక వేధింపులు మహిళలకు మాత్రమే జరుగుతాయని అనుకోవడం కూడా సరికాదు. పురుషులు కూడా బాధితులవుతారు. అయితే అధికారం, సామాజిక నిర్మాణాలు, లింగ అసమానతల కారణంగా మహిళలు ఎక్కువగా ఎదుర్కొనే ప్రత్యేక సమస్యలు ఉన్నాయి. అందుకే మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి అవసరం. అదే సమయంలో ప్రతి లింగానికి చెందిన వ్యక్తి గౌరవం, సమ్మతి, భద్రతను సమానంగా గుర్తించే సంస్కృతి అవసరం.

**• సోషల్ మీడియా కోర్టులు**

ఇలాంటి వార్తలకు టీఆర్పీ ఉంటుంది. వీడియోలకు వైరల్ విలువ ఉంటుంది. సంచలన శీర్షికలకు క్లిక్స్ వస్తాయి. కానీ ఒక బాధితురాలి జీవితం? ఒక కుటుంబం? ఒక ఆరోపణ ఎదుర్కొంటున్న వ్యక్తి ప్రతిష్ట? వాటికి తిరిగి విలువ చెల్లించగలమా? అందుకే మీడియా సంచలనాన్ని కాదు, సత్యాన్ని వెతకాలి. వీడియోలను విచక్షణ లేకుండా ప్రచారం చేయకూడదు. బాధితుల వ్యక్తిగత వివరాలను బయటపెట్టకూడదు. ఆరోపణను తీర్పుగా రాయకూడదు. ఈ రోజుల్లో పోలీసుల కంటే ముందే సోషల్ మీడియా తీర్పు చెబుతోంది. ఒక వీడియో వచ్చింది. వెంటనే “నేరస్థుడు!” అనే వాదన వెలువడుతుంది. ఒక మహిళ ఆరోపించింది. వెంటనే— “ఆమె నిజమే చెబుతోంది!” లేదా— “ఆమె రాజకీయ కుట్ర చేస్తోంది!” ఇది రెండూ ప్రమాదకరం. సోషల్ మీడియా కోర్టు కాదు. న్యాయం సాక్ష్యాలతో జరుగుతుంది. ప్రజలు కూడా ప్రశ్నించాలి. ఎన్నికల సమయంలో అభ్యర్థి కులం ఏమిటి? పార్టీ ఏది? డబ్బు ఎంత ఖర్చు చేస్తాడు? ఎంత బలమైన నాయకుడు? అనే ప్రశ్నలతో పాటు మరో ప్రశ్న కూడా రావాలి. “ఈ వ్యక్తి మహిళల పట్ల, బలహీన వర్గాల పట్ల, తన కంటే తక్కువ అధికారంలో ఉన్నవారి పట్ల ఎలా ప్రవర్తిస్తాడు?” ఇది కూడా ఓటు ప్రమాణం కావాలి.

**• కుర్చీకి ముందు వ్యక్తిత్వం**

ఒక నాయకుడి అసలు బలం అతని అనుచరుల సంఖ్య కాదు. అతని వాహనాల కాన్వాయ్ కాదు. అతని భద్రతా సిబ్బంది కాదు. అతని సోషల్ మీడియా ఫాలోయింగ్ కాదు. తనకు ఎదురు చెప్పే వ్యక్తిని కూడా గౌరవించే సామర్థ్యం. అదే నాయకత్వం. ‘లేదు’ అనే మాట విన్నప్పుడు ఆగ్రహించకుండా వెనక్కి తగ్గడం కూడా నాయకత్వమే. అధికారం ఉన్నప్పటికీ హద్దు దాటకుండా ఉండటం నిజమైన శక్తి. చివరిగా ఒక్క మాట: లైంగికతను కాదు... దుర్వినియోగాన్ని ప్రశ్నిద్దాం. సమాజం లైంగికతను దాచిపెట్టడం వల్ల సమస్యలు పరిష్కారం కావు. అలాగే లైంగికతను సంచలనంగా మార్చడం వల్ల కూడా సమస్యలు పరిష్కారం కావు. మనకు కావాల్సింది అవగాహన. మనకు కావాల్సింది శాస్త్రీయ దృష్టి. మనకు కావాల్సింది సమ్మతి సంస్కృతి. మనకు కావాల్సింది చట్టంపై నమ్మకం. మనకు కావాల్సింది రాజకీయ జవాబుదారీతనం. ఒక నాయకుడికి కోరికలు ఉండటం అతని మానవత్వం. కానీ ఆ కోరికల కోసం మరొకరి స్వేచ్ఛను త్యాగం చేయడం మాత్రం అతని హక్కు కాదు. ప్రేమకు సమ్మతి కావాలి. సంబంధానికి గౌరవం కావాలి. లైంగికతకు బాధ్యత కావాలి. అధికారానికి నియంత్రణ కావాలి. ప్రజాప్రతినిధికి నైతికత కావాలి. ఇవి లేకపోతే కుర్చీ ఎంత పెద్దదైనా ప్రయోజనం లేదు. ఎందుకంటే ప్రజలు ఓటు వేసి పదవి ఇస్తారు. కానీ ఆ పదవికి గౌరవం తెచ్చేది నాయకుడి నడవడి. లైంగిక ఆరోపణలు ఎదురైన ప్రతి సందర్భంలో మనం రెండు తప్పులు చేయకూడదు. ఒకటి—ఆరోపణను తీర్పుగా మార్చడం. రెండు—పదవిని కవచంగా మార్చడం. ఈ రెండింటి మధ్యే నిజమైన న్యాయం ఉంది. ఈ దేశానికి అవసరమైనది నాయకుల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగిచూడటం కాదు. ప్రజా పదవిలో ఉన్నవారు ఇతరుల హక్కులను గౌరవిస్తున్నారా లేదా అని ప్రశ్నించడం. అది జరిగిన రోజే రాజకీయ సంస్కృతిలో మార్పు మొదలవుతుంది. అది జరిగిన రోజే మహిళా భద్రతకు అర్థం వస్తుంది. అది జరిగిన రోజే సమ్మతికి విలువ పెరుగుతుంది. అది జరిగిన రోజే అధికారానికి హద్దు తెలుస్తుంది. అది జరిగిన రోజే.. కుర్చీకి కాదు... బాధ్యతకు గౌరవం వస్తుంది!

**• కామం కాదు... కంట్రోల్ సమస్య!**

కొన్ని సందర్భాల్లో సమస్యను కేవలం లైంగిక కోరికగా చూడటం కూడా తప్పు. అధికార దుర్వినియోగంలో నియంత్రణ కోరిక, ఆధిపత్య భావన, తిరస్కరణను అంగీకరించలేకపోవడం, ఇతరుల హద్దులను గౌరవించకపోవడం వంటి మానసిక అంశాలు కూడా పాత్ర పోషించవచ్చు. అయితే ప్రతి లైంగిక ఆరోపణకు మానసిక కారణాన్ని ఊహించడం శాస్త్రీయంగా సరైనది కాదు. నిపుణుల మూల్యాంకనం లేకుండా ఎవరినీ మానసికంగా ‘అసాధారణుడు’గా ముద్ర వేయడం కూడా తప్పు. ప్రవర్తనను విమర్శించాలి. వ్యక్తిని మానసికంగా లేబుల్ చేయకూడదు. రాజకీయ పార్టీలకు జీరో టాలరెన్స్ పాలసీ కావాలి ప్రతి పార్టీకి ప్రత్యేక లైంగిక వేధింపుల వ్యతిరేక విధానం ఉండాలి. ఆ విధానంలో స్వతంత్ర ఫిర్యాదు వ్యవస్థ ఉండాలి. పార్టీకి చెందిన మహిళా కార్యకర్తకు ఫిర్యాదు చేయడానికి పార్టీ నాయకుడి అనుమతి అవసరం ఉండకూడదు. తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పుడు విచారణపై ప్రభావం చూపకుండా సంబంధిత నేతను తాత్కాలికంగా బాధ్యతల నుంచి దూరం పెట్టే విధానం ఉండాలి. బాధితురాలి గోప్యతను కాపాడాలి. పేరు, ఫోన్ నంబర్, ఫోటోలు, వ్యక్తిగత వివరాలను ప్రచారం చేయకూడదు.

అదే సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి హక్కులను కూడా కాపాడాలి. విచారణ పూర్తయ్యే వరకు అతనిని నేరస్థుడిగా ప్రకటించకూడదు. అయితే న్యాయపరంగా దోషం నిర్ధారణ అయితే పార్టీ పరంగా కూడా కఠిన చర్యలు ఉండాలి.



## కార్యకర్తల గుండెల్లో గుబులు
## సీమ జిల్లాల్లో రచ్చ రచ్చ
## ఉమ్మడి కడపలో ముదిరిన అసంతృప్తి?
## స్థానిక పోరులో టికెట్లే అసలు పరీక్ష..
## అధిష్ఠానం ముందున్న అతి పెద్ద సవాల్

# పసుపు దండులో.. ముసుగు వీరులు
## నేతల చుట్టూ వైసీపీ కేడర్



**ఏపీలో టీడీపీ అధికారంలో ఉన్నప్పటికీ.. ముఖ్యంగా రాయలసీమలోని కొన్ని నియోజకవర్గాల్లో వైసీపీ పాత కేడర్ ప్రభావం కొనసాగుతోందన్న చర్చ టీడీపీ కార్యకర్తల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇది ఎంతవరకు నిజమన్నదికంటే.. ఇలాంటి భావన ఎందుకు ఏర్పడిందన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. 2024 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 175 స్థానాల్లో 164 సీట్లు గెలుచుకోగా.. వైసీపీ 11 స్థానాలకే పరిమితమైంది. కూటమికి భారీ విజయం దక్కినా.. క్షేత్రస్థాయిలో పాత రాజకీయ నెట్‌వర్క్‌లు పూర్తిగా కనుమరుగుకాలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్రామ, మండల స్థాయిల్లో ఏర్పడిన వ్యక్తిగత సంబంధాలు, వ్యాపార ప్రయోజనాలు, కాంట్రాక్టులు, సామాజిక సమీకరణాలు ప్రభుత్వం మారగానే అంతరించవు. అందుకే వైసీపీకి చెందిన కొందరు నేతలు కొత్త అధికార కేంద్రాలకు దగ్గరవుతున్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. "ఎన్నికల్లో మేము పోరాడాం.. అధికారంలోకి వచ్చాక మళ్లీ వాళ్లకే ప్రాధాన్యమా?" అన్న ప్రశ్న టీడీపీ కేడర్‌లో వినిపిస్తోంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల చుట్టూ పాత వైసీపీ పరిచయాలు ఉన్న నేతలు కనిపించడం అసంతృప్తిని పెంచుతోంది. అయితే ఈ పరిస్థితి ప్రతి నియోజకవర్గంలోనూ ఒకేలా ఉందని చెప్పలేం. కొందరు నిజంగా టీడీపీలో కలిసిపోయి ఉండొచ్చు.. మరికొందరు వ్యక్తిగత లేదా రాజకీయ ప్రయోజనాల కోసం దగ్గరవుతుండొచ్చు. అయినప్పటికీ కేడర్‌లో పెరుగుతున్న ఈ అనుమానం పార్టీ నాయకత్వం గమనించాల్సిన కీలక సంకేతం**

### రాయలసీమలో ఎందుకు ఎక్కువ చర్చ?

వైఎస్ జగన్ రాజకీయ ప్రస్థానానికి కడప ఒక కీలక భౌగోళిక, రాజకీయ కేంద్రం. అక్కడ వైసీపీకి సంవత్సరాలుగా ఏర్పడిన గ్రామస్థాయి నెట్ వర్క్ ఉంది. ఇలాంటి ప్రాంతంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అసలు పరీక్ష ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కాదు.. తన సొంత రాజకీయ యంత్రాంగాన్ని పునర్నిర్మించుకోవడం. ఎన్నికల సమయంలో పార్టీ జెండా మోసిన కార్యకర్తకు స్థానికంగా ప్రాధాన్యం లేకపోతే.. ఎన్నికల అనంతరం అతని రాజకీయ ఉత్సాహం తగ్గుతుంది. అదే సమయంలో నిన్నటి వరకు ప్రత్యర్థి పార్టీలో ఉన్న వ్యక్తి ఎమ్మెల్యే చుట్టూ తిరుగుతూ పనులు సాధించుకుంటున్నాడన్న భావన కలిగితే.. అసంతృప్తి మరింత పెరుగుతుంది. కడపలో కాంట్రాక్టులు, పనులు, స్థానిక వనరుల పంపిణీ వంటి అంశాలపై వైసీపీకి చెందిన పాత నాయకుల ప్రభావం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇవి ఒక్కొక్కటిగా నిర్ధారించాల్సిన ఆరోపణలే. కానీ రాజకీయంగా వాటి ప్రభావం మాత్రం స్పష్టంగా ఉంటుంది. నిజం కంటే ముందుగా ఒక భావన పనిచేస్తుంది. "మన వాళ్లకు అవకాశం లేదు.. వాళ్లకే అన్నీ" అనే భావన ఏర్పడితే అది రేపటి ఎన్నికల్లో ఓటు రూపంలో బయటపడే అవకాశం ఉంటుంది.

### కడపలో రచ్చః.. రచ్చస్య.. రచ్చోభ్యః

రాయలసీమ రాజకీయాల్లో వ్యక్తిగత సంబంధాలు, కుటుంబ ప్రభావం, స్థానిక సామాజిక సమీకరణాలు, ఆర్థిక బలం.. ఇవన్నీ ఎన్నికల రాజకీయాలపై గణనీయమైన ప్రభావం చూపుతాయి. అందుకే అక్కడ అధికార పార్టీ మారినా స్థానిక రాజకీయ వ్యవస్థ ఒక్కరోజులో మారిపోదు. ముఖ్యంగా జగన్ సొంత జిల్లా, ఉమ్మడి కడప జిల్లా విషయానికి వస్తే.. కడప నియోజకవర్గం పూర్తిగా వైసీపీ నేతలతో నిండిపోయి ఉందంటూ అదే పార్టీలోని ప్రత్యర్థి వర్గం రచ్చకెక్కింది. పొరుగు నియోజకవర్గం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి తండ్రి, టీడీపీ సీనియర్ నేత పుత్తా నరసింహారెడ్డిని అచ్చ టీడీపీ నేతలు శరణు కోరారు. ఈ అంశం ఇప్పటికీ రచ్చ రచ్చ చేస్తుంది. ఫలితంగా, మాధవి రెడ్డి దంపతులు పార్టీలో దాదాపుగా ప్రాభవం కోల్పోయిన దశకు వచ్చారు. పొలిట్ బ్యూరో స్థానం నుంచి జోనల్ కోఆర్డినేటర్ స్థాయికి శ్రీనివాసరెడ్డి పదవి కుదించారు. మాధవి రెడ్డి గతంలో మాదిరి, హంగామా చేయడం తగ్గించారు. రైల్వే కోడూరులో ప్రస్తుతం టీడీపీ ఇన్‌ఛార్జిగా ఉంటున్న ముక్కా రూపానంద రెడ్డి, వైసీపీ మూలాలున్న నాయకుడిగానే రంగంలోకి దిగారు. తొలి నుంచి పార్టీని అంటిపెట్టుకున్న విశ్వనాథనాయుడు వంటి సీనియర్ నేతలు, పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఇక రాజంపేట విషయానికి వస్తే టీడీపీకి 2019 నుంచి 2024 వరకు టీడీపీ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న బత్యాల చెంగల్రాయలు పార్టీకి ప్రస్తుతం దూరంగా ఉంటున్న పరిస్థితి. ఇక్కడ ఇన్‌ఛార్జ్‌గా ఇతర పార్టీల మూలాలున్న చమర్తి జగన్మోహన్ రాజును ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. ఆయన చుట్టూ.. వైసీపీ కేడరే ఉందంటూ ఇటీవల అచ్చ తెలుగు దేశం కార్యకర్తలు రచ్చ చేసిన సందర్భాలున్నాయి. సర్దుబాటు కోసం అధిష్టానం మంగళగిరికి పిలిపించి.. సయోధ్య కుదర్చే పని చేసిన అది నెరవేరలేదు. జగన్‌రాజు మట్టి మాఫియాపై ఇతర కార్యకలాపాలపై అచ్చ పార్టీ నేతలు భారీగా వినతిపత్రాలను, అధిష్టానానికి ఫిర్యాదులు పంపిన దాఖలాలున్నాయి. ఇప్పటికీ చమర్తిపై అసలు పార్టీ నేతలు గళమెత్తుతూనే ఉన్నారు. ఇక బద్వేలు పరిస్థితైతే సరేసరి. ప్రొద్దుటూరులో పరిస్థితి చిత్ర విచిత్రంగా ఉంది. గత వైసీపీ పాలనలో కౌన్సిలర్లుగా పనిచేసివారందరూ దాదాపుగా ప్రభుత్వం మారగానే దాదాపు టీడీపీలోకి వలస వచ్చారు. క్లాస్ 1 కాంట్రాక్టర్లు సైతం, వైసీపీ నుంచి టీడీపీలోకి దిగుమతయ్యారు. ఇలా రాయలసీమలోని మిగతా జిల్లాల విషయం కూడా ఇదే విధానం కొనసాగుతోంది. రేపటి స్థానిక ఎన్నికల్లో టికెట్లు కూడా వైసీపీ కేడర్ ఎగురేసుకునే పరిస్థితులు కన్పిస్తున్నాయన్నది తెలుగు తమ్ముళ్ల అభిప్రాయం.

### ఇసుక.. మట్టి.. ఎర్రచందనం.. రాజకీయ ముద్ర

రాయలసీమలో మరో కీలకమైన అంశం సహజ వనరుల అక్రమ రవాణా, మైనింగ్ వ్యవహారాలు. ఇసుక, మట్టి, క్వారీలు వంటి అంశాలు ఎప్పటి నుంచో రాజకీయంగా సున్నితమైనవే. ప్రభుత్వం ఎన్ని నియంత్రణలు విధించినా స్థానిక స్థాయిలో అక్రమ కార్యకలాపాలకు అవకాశం ఉంటే.. దాని రాజకీయ భారం చివరకు అధికార పార్టీ మీదే పడుతుంది. ఇసుక ఇతర రాష్ట్రాలకు తరలిపోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. జీపీఎస్ ద్వారా వాహనాలను పర్యవేక్షించాలని, రాష్ట్ర సరిహద్దులు దాటి అక్రమంగా ఇసుక తరలించే వాహనాలను సీజ్ చేయాలని కూడా ఆదేశించినట్లు జూన్‌లో వచ్చిన నివేదికలు చెబుతున్నాయి. ప్రస్తుత నిబంధనల్లో ఇతర రాష్ట్రాలకు ఇసుక రవాణా నిషేధిత కార్యకలాపంగా కూడా పేర్కొనబడింది. అయితే ప్రభుత్వ ఆదేశాలు ఒక వైపు.. క్షేత్రస్థాయి పరిస్థితులు మరోవైపు ఉంటే సమస్య అక్కడే మొదలవుతుంది. "ప్రభుత్వం కఠినంగా ఉంది" అని ముఖ్యమంత్రి చెబుతున్న సమయంలోనే అక్రమ రవాణా జరుగుతోందన్న ఆరోపణలు వస్తే.. దాని వెనుక ఎవరు ఉన్నారన్న ప్రశ్న తలెత్తుతుంది. అంతకంటే ముఖ్యంగా అధికార పార్టీకి చెందిన నాయకులే ప్రత్యర్థి పార్టీకి చెందిన పాత నెట్ వర్క్‌పై ఆధారపడుతున్నారన్న ప్రచారం వస్తే.. అది కేడర్ మనోధైర్యాన్ని దెబ్బతీస్తుంది. ఇది కేవలం ఇసుకకు మాత్రమే పరిమితం కాదు. మట్టి తవ్వకాలు, క్వారీలు, కాంట్రాక్టులు, రవాణా, ఇతర స్థానిక ఆర్థిక కార్యకలాపాల చుట్టూ ఎవరి ప్రభావం ఉందన్నది రాజకీయంగా పెద్ద అంశంగా మారుతుంది. ఎర్రచందనం వంటి సున్నితమైన వ్యవహారాలను కూడా రాజకీయ ఆరోపణలతో కలిపి చూడటం జరుగుతోంది. అయితే అలాంటి ఆరోపణలపై నిర్దిష్ట ఆధారాలు లేకుండా వ్యక్తులపై నిర్ణయాత్మక ఆరోపణలు చేయడం సరికాదు. కానీ ప్రభుత్వానికి మాత్రం ఒక విషయం స్పష్టం కావాలి—చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పార్టీ రంగు ఉండకూడదు.

### ఇంటెలిజెన్స్ రిపోర్టులు ఏం చెబుతున్నాయి?

ఇక్కడే మరో ఆసక్తికరమైన ప్రశ్న. స్థానికంగా జరుగుతున్న ఈ చర్చలు అధిష్ఠానం దృష్టికి వెళ్లకుండా ఉంటాయా? ఇంటెలిజెన్స్ వ్యవస్థలు, స్పెషల్ బ్రాంచ్ నివేదికలు, నియోజకవర్గాల రాజకీయ పరిస్థితులపై పార్టీ అంతర్గత సమీక్షలు.. ఇవన్నీ అధికారంలో ఉన్న పార్టీకి అందుబాటులోనే ఉంటాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ వంటి నాయకులు క్షేత్రస్థాయి రాజకీయ సమాచారాన్ని సేకరించే వ్యవస్థలను కలిగి ఉంటారు. కానీ సమాచారం ఉండటం ఒకటి.. దానిపై చర్య తీసుకోవడం మరొకటి. ఎందుకు చర్య ఆలస్యం కావచ్చు? స్థానిక రాజకీయ సమీకరణాలు. ఎమ్మెల్యేకు ఉన్న వ్యక్తిగత బలం. కుల, సామాజిక సమీకరణాలు. ఆర్థిక వనరులు. ఎన్నికల సమయంలో అవసరమైన స్థానిక మేనేజ్‌మెంట్. ప్రత్యర్థి పార్టీలో ఉన్న ప్రభావశీలుల సహకారం. ఇవన్నీ ఒక ఎమ్మెల్యేను కొన్ని నిర్ణయాల విషయంలో రాజీ పడేలా చేయవచ్చు. కానీ ఈ రాజీకి ఒక పరిమితి ఉంటుంది. రాజకీయంగా గెలిపించిన కేడర్‌నే పక్కన పెట్టి ప్రత్యర్థి నెట్‌వర్క్‌పై ఆధారపడటం ఆ పరిమితిని దాటినట్లే. అది ఎన్నికల సమయంలో ప్రత్యక్షంగా బయటపడకపోయినా.. టికెట్ల పంపిణీ సమయంలో మాత్రం తప్పకుండా బయటపడుతుంది.



### "కార్యకర్తే పార్టీకి పునాది".. మరి క్షేత్రంలో?

చంద్రబాబు, లోకేష్ తరచూ కార్యకర్త పార్టీకి వెన్నెముక అని చెబుతుంటారు. ఆ మాటలో రాజకీయ సత్యం ఉంది. ఎన్నికల సమయంలో నాయకుడి వెంట నిలబడేది కేడర్. ఓటర్లను బూత్‌కు తీసుకెళ్లేది కేడర్. ప్రత్యర్థి ప్రచారాన్ని ఎదుర్కొనేది కేడర్. నాయకుడికి రక్షణగా నిలబడేది కూడా అదే కేడర్. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదే కార్యకర్తకు "నీ పని అయిపోయింది" అన్న భావన కలిగితే.. పార్టీకి కనిపించని పగుళ్లు మొదలవుతాయి. నాయకుడి చుట్టూ రోజూ కనిపించే జనంతో పోలిస్తే.. ఎన్నికల సమయంలో కనిపించే నిజమైన కేడర్ వేరు. ఈ తేడాను గుర్తించడంలో పార్టీ విఫలమైతే.. అధికార భవనం బయట నిలబడి ఉన్న కార్యకర్తే రేపటి ఎన్నికల్లో తీర్పు చెప్పే వ్యక్తిగా మారతాడు. ఇదే ఇప్పుడు టీడీపీ ముందున్న అసలు సవాల్. అధికారాన్ని ఆస్వాదించే వర్గం ఎంత పెద్దదో కాదు.. పార్టీ కోసం నిలబడే అసలు కేడర్ ఎంత బలంగా ఉందో ముఖ్యం. ప్రత్యర్థి పార్టీకి చెందిన వ్యక్తులు వచ్చి చేరడం తప్పు కాదు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పునర్వ్యవస్థీకరణ సహజం. కానీ కొత్తగా వచ్చినవారు పాత కార్యకర్తలపై ఆధిపత్యం చెలాయించే స్థాయికి వెళ్తే మాత్రం అది పార్టీ అంతర్గత అసంతృప్తికి దారి తీస్తుంది.

### సర్వేల సంకేతాలు.. నిజమా? ప్రచారమా?

ఇప్పటివరకు కనిపించని అసలు రాజకీయ సంఘర్షణ టికెట్ల పంపిణీ సమయంలో బయటపడే అవకాశం ఉంది. ఒకవైపు సంవత్సరాలుగా పార్టీ కోసం పనిచేసిన టీడీపీ కార్యకర్త. మరోవైపు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే, ఎంపీ చుట్టూ చేరిన ప్రభావశీలుడు. ఇద్దరిలో టికెట్ ఎవరికి? ఇదే అసలు ప్రశ్న. పార్టీ గుర్తు ఎవరి చేతిలోకి వెళ్తుంది? జెండా ఎవరు మోస్తారు? బూత్‌లో ఎవరు పనిచేస్తారు? స్థానిక ఎన్నికల్లో ప్రత్యర్థిని ఎవరు ఎదుర్కొంటారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు కేవలం నాయకుడి వ్యక్తిగత అభిప్రాయంతో నిర్ణయించలేం. పార్టీకి క్షేత్రస్థాయి బలం ఉన్న వ్యక్తికే అవకాశం ఇవ్వాల్సి ఉంటుంది. లేకపోతే ఒక విచిత్ర పరిస్థితి ఏర్పడవచ్చు. పైకి అభ్యర్థి టీడీపీకి చెందినవాడిలా కనిపిస్తాడు. పార్టీ గుర్తు కూడా టీడీపీదే. ప్రచార వేదికపై పసుపు జెండా ఉంటుంది. కానీ అతని వెంట తిరిగే స్థానిక రాజకీయ బలం మాత్రం గతంలో వైసీపీతో ఉన్న నెట్ వర్క్ కావచ్చు. ఇది నిజంగా ఎక్కడైనా జరిగితే.. అది కేవలం టికెట్ వ్యవహారం కాదు. పార్టీ స్వరూపాన్నే ప్రశ్నించే పరిణామం. ఇటీవలి రోజుల్లో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందంటూ కొన్ని సర్వేలు, రాజకీయ అంచనాలు ప్రచారంలోకి వచ్చాయి. ఉదాహరణకు 'మూడ్ ఆఫ్ ఆంధ్రా' పేరుతో ప్రచారంలో ఉన్న ఒక సర్వే కూటమికి ప్రతికూలంగా కొన్ని సంఖ్యలను పేర్కొంది. అయితే దాని పద్ధతి, నమూనా, స్వతంత్ర ధ్రువీకరణపై ప్రశ్నలు కూడా ఉన్నాయని అదే కథనాలు పేర్కొంటున్నాయి. కాబట్టి వాటిని తుది ప్రజాభిప్రాయంగా తీసుకోవడం సరికాదు. అయితే సర్వే నంబర్ల కంటే వాటి వెనుక ఉన్న రాజకీయ సంకేతం ముఖ్యమైనది. రెండేళ్లు దాటిన ప్రభుత్వంపై స్థానికంగా అసంతృప్తి ఉందన్న భావన ఏర్పడితే.. దాన్ని ప్రతిపక్షం ఎన్నికల ఆయుధంగా మలచుకోవడానికి ప్రయత్నిస్తుంది. జగన్ చేస్తున్నదీ అదే. ఇసుక, మట్టి, మద్యం, ఉద్యోగాలు, సంక్షేమం, స్థానిక పనులు.. ఏ అంశం దొరికినా దాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది.

### రాబోయే స్థానిక పోరు.. అసలు ఎక్స్‌రే

స్థానిక ఎన్నికలు టీడీపీకి సాధారణ రాజకీయ పోరు కాదు.. పార్టీ బలం, కేడర్ నిబద్ధత, నాయకత్వ నిర్ణయ సామర్థ్యానికి తుది పరీక్ష. నేతల చుట్టూ కనిపించే జనసందోహం కాదు.. టికెట్ దక్కని సమయంలోనూ పార్టీ జెండా మోసే కార్యకర్తలే అసలు బలం. టికెట్ల కేటాయింపులో సామాజిక సమీకరణాలు, గెలుపు అవకాశాలు, క్షేత్రస్థాయి కేడర్ అభిప్రాయాలు, గత పోరాటాల్లో నిలిచిన వారి పాత్రను పక్కనపెట్టి నిర్ణయాలు తీసుకుంటే అసంతృప్తి తిరుగుబాటుగా మారుతుంది. ఆ తిరుగుబాటు ఓటు చీలికకు దారి తీస్తే ప్రత్యర్థికి లాభం ఖాయం. అందుకే నాయకత్వం ఇప్పుడే గ్రామస్థాయి వాస్తవాలను తెలుసుకుని, నిజమైన కార్యకర్తలకు గౌరవం ఇచ్చి, సమన్వయంతో అభ్యర్థులను ఎంపిక చేయాలి. పసుపు జెండా కేవలం గుర్తుగా కాకుండా.. పసుపు సైన్యం ఐక్యతకు ప్రతీకగా నిలవాలి. చివరికి ఈ ఎన్నికలు ఎవరి ప్రచారం బలంగా ఉందో కాదు.. ఎవరి కేడర్ చివరి వరకు నిలిచిందో తేల్చనున్నాయి. టికెట్లు ప్రకటించిన రోజే టీడీపీ భవిష్యత్ విజయానికి పునాది పడుతుందా.. లేక అంతర్గత అసంతృప్తికి తలుపులు తెరుచుకుంటాయా అన్నది స్పష్టమవుతుంది.

### వైసీపీ ఏం చేస్తోంది?

ఇదే సమయంలో వైసీపీ తనకు లభిస్తున్న ప్రతి రాజకీయ అవకాశాన్ని వినియోగించుకునే ప్రయత్నం చేస్తోంది. ఆగస్టు 20న జగన్ స్థానిక సంస్థల ఎన్నికలకు క్షేత్రస్థాయి వ్యూహాలతో సిద్ధం కావాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆగస్టు 25న కూడా ప్రతి స్థానంలో పోటీ చేయాలన్న దిశగా కేడర్‌ను సమీకరించే ప్రయత్నం చేసినట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇక్కడ జగన్ వ్యూహంలో ఒక ముఖ్యమైన అంశం కనిపిస్తోంది. అధికార వ్యతిరేకత ఉందని ప్రజలను నమ్మించడం కంటే.. ఆ అసంతృప్తిని గ్రామస్థాయి ఎన్నికల యంత్రాంగంగా మార్చడం. అదే వైసీపీకి అసలు లక్ష్యం కావచ్చు. ఎందుకంటే స్థానిక సంస్థల ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికలకంటే భిన్నమైనవి. ఇక్కడ అభ్యర్థి వ్యక్తిగత సంబంధాలు, కుటుంబ ప్రభావం, గ్రామస్థాయి పరిచయాలు, ఆర్థిక బలం, స్థానిక సమస్యలు.. అన్నీ కీలకం.

అందుకే టీడీపీ నేతల చుట్టూ వైసీపీ కేడర్ చేరుతున్నదన్న ఆరోపణ నిజమైతే.. అది వైసీపీకి ఒక రకంగా బలమే. ఎందుకంటే అధికార పార్టీ పేరుతో పని చేస్తున్న స్థానిక వ్యవస్థలో ప్రత్యర్థి పార్టీకి చెందిన పాత కేడర్‌కు ప్రభావం లభిస్తే.. రేపటి స్థానిక ఎన్నికల్లో అదే వ్యక్తి ఏ పార్టీ టికెట్ పై నిలబడతాడన్నది ఆసక్తికరమైన ప్రశ్న.

### జనసేన దూకుడు..

#### చంద్రబాబు–లోకేశ్ ముందు ఉన్న పరీక్ష ఇదే




ఇక కూటమిలోని జనసేన విషయాన్ని కూడా విస్మరించలేం. పవన్ కల్యాణ్ పార్టీ గ్రామస్థాయిలో విస్తరించేందుకు ఉత్సాహంగా పనిచేస్తున్న సమయంలో టీడీపీ కేడర్‌లో అసంతృప్తి పెరగడం కూటమి అంతర్గత సమీకరణాలపై కూడా ప్రభావం చూపవచ్చు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య సీట్ల సర్దుబాటు, స్థానిక నాయకుల పోటీ, వ్యక్తిగత ఆశావహుల సంఖ్య.. ఇవన్నీ మరింత సంక్లిష్టతను సృష్టించే అవకాశముంది. అంటే టీడీపీకి సమస్య కేవలం వైసీపీతో కాదు. తన సొంత కేడర్‌ను సంతృప్తిపరచడం, కూటమి భాగస్వాములతో సమన్వయం, ప్రత్యర్థి పార్టీ నుంచి వచ్చే ప్రభావశీలులను సమర్థంగా ఉపయోగించుకోవడం—మూడు పనులు ఒకేసారి చేయాల్సి ఉంటుంది. చంద్రబాబు రాజకీయంగా ఎన్నో సంక్షోభాలను చూశారు. సంస్థను ఎలా నిర్మించాలో, కేడర్‌ను ఎలా కాపాడాలో ఆయనకు అనుభవం ఉంది. లోకేష్ కూడా పార్టీ వ్యవస్థను గ్రామస్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. కానీ అధికారంలో ఉన్నప్పుడు వచ్చే ఒక ప్రత్యేకమైన సమస్యను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అధికారానికి దగ్గరయ్యే వారి సంఖ్య పెరుగుతుంది.. నిజమైన పార్టీ కార్యకర్తలను గుర్తించడం కష్టమవుతుంది. ఇది ఏ పార్టీకి అయినా ప్రమాదమే. అధికారంలో ఉన్నప్పుడు ప్రతి ఒక్కరూ తమను పార్టీ మిత్రులుగా పరిచయం చేసుకుంటారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం అసలు ఎవరు నిలబడ్డారో తెలుస్తుంది. టీడీపీ కూడా 2019-24 మధ్య ఆ అనుభవాన్ని ఎదుర్కొంది. అందుకే ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో తనకు దూరంగా ఉన్నవారు ఎందుకు దగ్గరవుతున్నారు? వారు నిజంగా పార్టీ సిద్ధాంతానికి వచ్చారా? లేక అధికారానికి దగ్గర కావడానికే వచ్చారా? అన్నది పరిశీలించాల్సిందే. చంద్రబాబు దగ్గర ప్రభుత్వ వ్యవస్థ ఉంది. లోకేష్ దగ్గర పార్టీ వ్యవస్థను పునర్నిర్మించే అవకాశం ఉంది. కానీ ఆ రెండింటి మధ్య అసలు వంతెన టీడీపీ కేడర్. ఆ వంతెన బలహీనపడితే అధికార బలం కూడా ఒక దశలో సరిపోదు.

## ట్రోలింగ్‌పై శ్రేయాంక పటేల్
# ఘాటు కౌంటర్




భారత మహిళల క్రికెట్ జట్టు ఆల్‌రౌండర్ శ్రేయాంక పటేల్ తన డ్యాన్స్ రీల్స్‌పై వస్తున్న ట్రోలింగ్‌పై తొలిసారి స్పందించింది. సోషల్ మీడియాలో తాను డ్యాన్స్ వీడియోలు, ఫ్యాషన్‌కు సంబంధించిన పోస్టులు చేయడాన్ని కొందరు విమర్శిస్తున్నా.. వాటిని తాను ప్రతికూలంగా చూడటం లేదని స్పష్టం చేసింది. తాను ఇన్‌స్టాగ్రామ్‌లో ఉండటం, డ్యాన్స్ చేయడం, నచ్చిన దుస్తులు ధరించడం ఇష్టపడతానని, తనకు నచ్చిన విధంగా జీవించడంలో ఎలాంటి సంకోచం లేదని చెప్పింది. ప్రశంసలు వచ్చినా, విమర్శలు ఎదురైనా అవన్నీ తనపై ప్రజల దృష్టి ఉందనే విషయాన్ని చూపిస్తున్నాయని శ్రేయాంక పేర్కొంది. ట్రోల్స్‌ను పట్టించుకోకుండా తనకు ఆనందాన్ని ఇచ్చే పనులపైనే దృష్టి పెడతానని తెలిపింది. తనపై విమర్శలు చేసేవారు బహుశా తాను బాగా రాణిస్తున్నందుకు అసూయపడుతున్నారని ఘాటుగా వ్యాఖ్యానించింది. గత రెండు నెలలుగా గాయం కారణంగా క్రికెట్‌కు దూరంగా ఉన్న శ్రేయాంక.. రాబోయే మహిళల ఆసియా కప్‌కు కూడా అందుబాటులో ఉండదు. అయితే 2026 ఆసియా క్రీడల కోసం ప్రకటించిన భారత జట్టులో ఆమెకు చోటు దక్కింది.

# జడేజా నోబాల్స్.. షాకింగ్ రికార్డు



శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో భారత స్టార్ స్పిన్నర్ రవీంద్ర జడేజా నోబాల్స్‌తో మరోసారి వార్తల్లో నిలిచాడు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో మూడు నోబాల్స్ వేసిన జడేజా.. రెండో ఇన్నింగ్స్‌లో మరో నోబాల్ వేశాడు. దీంతో 2021 నుంచి టెస్టు క్రికెట్‌లో అతడి నోబాల్స్ సంఖ్య ఏకంగా 88కు చేరింది. ఈ కాలంలో టెస్టుల్లో అత్యధిక నోబాల్స్ వేసిన స్పిన్నర్‌గా జడేజా నిలిచాడు. రెండో స్థానంలో ఉన్న పాకిస్థాన్ స్పిన్నర్ నోమన్ అలీ 40 నోబాల్స్‌తో ఉండగా.. జడేజా రికార్డు దానికి రెట్టింపుకంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. శ్రీలంకతో తొలి టెస్టులోనూ జడేజా నాలుగు నోబాల్స్ వేశాడు. అందులో ఒక నోబాల్ కారణంగా ధనంజయ డి సిల్వాకు కీలక లైఫ్ లభించింది. ఇక ప్రస్తుత రెండో టెస్టులో భారత్ భారీ ఆధిక్యం సాధించి శ్రీలంకను ఫాలోఆన్‌కు పంపింది. అయితే లంక రెండో ఇన్నింగ్స్‌లో 229/6తో నిలిచింది. వర్షం కారణంగా ఆట ముందుగానే ముగిసినా భారత్ మ్యాచ్‌పై పట్టు కొనసాగిస్తోంది.




## బుమ్రాకు బదులు జమ్మూ పేసర్..
# జాతీయ జట్టులోకి ఎంట్రీ

శ్రీలంకతో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌కు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా దూరం కానున్నట్లు సమాచారం. మోకాలి గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో అతడిని టెస్టులకు ఎంపిక చేయకూడదని బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్పోర్ట్స్ సైన్స్ బృందం నిర్ణయించినట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. బుమ్రా స్థానంలో జమ్మూ కశ్మీర్‌కు చెందిన 29 ఏళ్ల పేసర్ ఔకిబ్ నబీకి తొలిసారి భారత జాతీయ జట్టు పిలుపు రానున్నట్లు తెలుస్తోంది. గత రెండు రంజీ ట్రోఫీ సీజన్లలో 100కు పైగా వికెట్లు తీసిన నబీ.. జమ్మూ కశ్మీర్ రెడ్‌బాల్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. బ్యాటింగ్‌లోనూ ఉపయోగపడే సామర్థ్యం అతడికి ఉంది. జమ్మూ కశ్మీర్ నుంచి సీనియర్ భారత జట్టుకు ఎంపికయ్యే మూడో ఆటగాడిగా నబీ



నిలవనున్నాడు. గతంలో పర్వేజ్ రసూల్, ఉమ్రాన్ మాలిక్ జాతీయ జట్టుకు పిలుపు అందుకున్నారు. బుమ్రా గాయం విషయంలో తొందరపడకుండా ముందుకు సాగాలని వైద్య బృందం భావిస్తోంది. భారత్ ఇప్పటికే పలువురు ఆటగాళ్ల గాయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో నబీ ఎంపిక ఆసక్తికరంగా మారింది.

## శ్రీలంకపై సుతార్ పోరాటం..
# భహుతులే ప్రశంసలు

శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో నాలుగో రోజు భారత యువ స్పిన్నర్ మానవ్ సుతార్‌కు కఠిన పరిస్థితులు ఎదురయ్యాయి. లంక బ్యాటర్లు అతడిపై ఎదురుదాడికి దిగడంతో తొలి స్పెల్‌లో 12 ఓవర్లలోనే 65 పరుగులు సమర్పించుకున్నాడు. అయితే ఆ తర్వాత అద్భుతంగా పుంజుకున్న సుతార్.. రెండో స్పెల్‌లో ఆరు ఓవర్లు వేసి కేవలం 15 పరుగులకే రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. పసిందు సూరియబండారా, ధనంజయ డి సిల్వా వికెట్లు మ్యాచ్‌ను భారత్‌కు అనుకూలంగా మలిచాయి. యువ ఆటగాడిగా సుతార్‌కు ఇది మంచి పాఠమని భారత స్పిన్ బౌలింగ్ కోచ్ సైరాజ్ బహుతులే పేర్కొన్నారు. పరిస్థితులు ఎలా ఉన్నా 100 శాతం ప్రయత్నించడం, ప్రశాంతంగా ఉండటం సుతార్ బలం అని ప్రశంసించారు. మరోవైపు అరంగేట్రం చేసిన సారాంశ్ జైన్ కొంత డిఫెన్సివ్‌గా బౌలింగ్ చేశాడని బహుతులే తెలిపారు. 17.4 ఓవర్లలో 55 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీసుకున్న జైన్‌లో మంచి వైవిధ్యం ఉందన్నారు. నాలుగో రోజు ముగిసేసరికి శ్రీలంక 229/6తో 16 పరుగుల స్వల్ప ఆధిక్యంలో ఉంది.

# రోమాంచకం ట్రైలర్ విడుదల

టాలీవుడ్ అగ్ర దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో, 'మేమ్ ఫేమస' చిత్రం ద్వారా యూత్‌లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా సినిమా 'రోమాంచకం'. భద్రకాళి పిక్చర్స్ మరియు ప్రణయ్ రెడ్డి వంగా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి వేణుగోపాల్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. సుమంత్ ప్రభాస్ సరసన అనంతిక సానిల్‌కుమార్ కథానాయకిగా నటిస్తుండగా, వాసుకి వైభవ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 3న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కాబోతుండగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. కేవలం సాధారణ ప్రేమకథా చిత్రంగా కాకుండా, నేటి ఆధునిక కాలంలోని డేటింగ్ యాప్స్, రిలేషన్‌షిప్స్ మరియు ఊహించని మలుపులతో కూడిన యూత్ ఫుల్ రొమాంటిక్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. ట్రైలర్‌లో సుమంత్ ప్రభాస్ తనదైన తెలంగాణ నేటివిటీ యాసతో పాటు, తన మార్క్ కామెడీ అండ్ ఎనర్జిటిక్ నటనతో మరోసారి యువతను ఆకట్టుకునేలా కనిపించారు. మొదట ఎంతో సరదాగా, క్యూట్‌గా సాగే ఈ లవ్ స్టోరీ ఆ తర్వాత ఇంటెన్స్ ఎమోషన్స్, ఊహించని గొడవలు మరియు ఉత్కంఠభరితమైన మలుపులతో ఎలా సాగిందనే అంశాలను ట్రైలర్‌లో ఎంతో ఆసక్తికరంగా చూపించారు. సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఈ చిత్రానికి ప్రెజెంట్‌గా వ్యవహరిస్తుండటంతో, ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.




## ఇరుముడి నిలిపివేతపై
# ప్రేక్షకుల ఆందోళన

నారాయణపేట జిల్లా మక్తల్‌లో స్థానిక వెంకటరమణ థియేటర్ వద్ద బుధవారం ఉదయం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎంతో ఆసక్తిగా తిలకించాలనుకున్న రవితేజ 'ఇరుముడి' చిత్రాన్ని ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అకస్మాత్తుగా నిలిపివేయడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన ప్రేక్షకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సినిమాను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ థియేటర్ గేటు ఎదురుగా బైఠాయించి పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. గత రెండు రోజులుగా ఈ సినిమా కోసం జనం భారీగా పోటెత్తుతున్నారు. తమ సొంత పనులను సైతం పక్కన పెట్టి థియేటర్‌కు చేరుకుంటున్నప్పటికీ, టికెట్లు దొరక్క నిరాశతో వెనుదిరగాల్సి వస్తోందని ప్రేక్షకులు వాపోయారు. కనీసం నేడైనా సినిమా చూసే అవకాశం ఉంటుందని ఆశతో వస్తే, ప్రదర్శన రద్దు చేశారన్న వార్త వారిని నిరుత్సాహానికి గురిచేసింది. అవసరమైతే నేలపై కూర్చుని లేదా నిలబడి అయినా సినిమా చూస్తామని, ఎంతటి రద్దీనైనా భరిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ హఠాత్ పరిణామంతో స్థానికంగా కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.










# తమన్నా నటిస్తున్న ది వీవాన్ టీజర్ విడుదల



బాలీవుడ్ హ్యాండ్సమ్ హీరో సిద్దార్థ్ మల్హోత్రా స్టార్ హీరోయిన్ తమన్నా భాటియా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న మైథలాజికల్ ఫాంటసీ థ్రిల్లర్ 'ది వీవాన'. దీపక్ మిశ్రా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి అరుణాభ్ కుమార్ కథను అందించారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు బాలాజీ మోషన్ పిక్చర్స్ ది వైరల్ ఫీవర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాయి. సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా నుంచి తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ చూస్తుంటే.. సూర్యాస్తమయం తర్వాత ఎక్కడికి వెళ్లడం నిషిద్ధమో.. కథ అక్కడి నుంచే మొదలవుతుందనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. ఎవరైతే రాత్రి సమయంలో ఆ అడవిలోకి వెళ్తారో వారు తిరిగి రారనే ఒక దట్టమైన చీకటి శక్తి, రహస్యాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఇందులో సిద్దార్థ్ మల్హోత్రా ఇప్పటివరకు చూడని సరికొత్త యాక్షన్ అవతార్‌లో కనిపించగా, ఆయనకు ఆ అడవికి మధ్య ఏదో గూఢమైన సంబంధం ఉందని తమన్నా పాత్ర చెబుతుంది. టీజర్ చివర్లో వచ్చే విజువల్స్ దైవిక శక్తులు మరియు పురాణాల నేపథ్యాన్ని గుర్తుచేసేలా ఉన్నాయి. ఈ చిత్రంలో సిద్దార్థ్, తమన్నాలతో పాటు సునీల్ గ్రోవర్, మనీష్ పాల్, శ్వేతా తివారీ మరియు అనూప్ సోని తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# మరో మాఫియా డాన్ కథ
## యశ్ టాక్సిక్ మూవీ విశ్లేషణ

కేజీఎఫ్' ఫ్రాంచైజీ తర్వాత యశ్ నుంచి వస్తున్న సినిమా అనగానే 'టాక్సిక్'పై దేశవ్యాప్తంగా అంచనాలు మొదలయ్యాయి. దానికి తగ్గట్టే ఈ సినిమా ప్రచార చిత్రాలు కూడా సినిమాపై ఆసక్తిని పెంచాయి. భారీ తారాగాణంతో, హాలీవుడ్ స్థాయి అత్యున్నత సాంకేతిక విలువలతో, ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో బుధవారం 'టాక్సిక్' విడుదలైంది. గంగా (నయనతార), రాయ(యశ్) అక్కాతమ్ముళ్లు. చిన్నతనంలోనే అమ్మానాన్న దూరం కావడంతో రాయను గంగే అమ్మగా మారింది. తన జీవితాన్ని పణంగా పెట్టి మరీ తమ్ముడ్ని పెంచి పెద్ద చేసింది. చిన్నతనం నుంచీ నేర ప్రపంచంలోనే పెరిగి పెద్ద కావడంతో ఇద్దరూ నేరప్రవృత్తితోనే ఎదుగుతారు. గోవా నేరసామ్రాజ్యానికి తన తమ్ముడ్ని అధిపతిగా చూడాలనుకుంటుంది గంగ. అందుకోసం అప్పటికే గోవాను ఏలుతున్న ఓ మాఫియా డాన్‌తో చేతులు కలుపుతుంది. ఆ గ్యాంగ్‌లో రాయ కీలకమైన వ్యక్తిగా ఎదుగుతాడు. మాఫియా డాన్ కూతురు రెబెక్కా (తార సుతారియా) రాయకు చేరువవుతుంది. ఇద్దరూ ఒకటవుతారు. మరోవైపు ప్రత్యర్థుల దాడులు, ప్రతిదాడులతో కథ సాగుతూ ఉంటుంది. ఇంతలో రాయకు రాయల్ సర్కస్‌లో పనిచేసే నాడియా (కియారా అద్వానీ) పరిచయం అవుతుంది. మానసికంగా, శారీరకంగా కూడా ఇద్దరూ ఒకటవుతారు. ఈ క్రమంలో నాడియా గర్భవతి అవుతుంది. తన కూతురుని కాదని వేరొక అమ్మాయితో రాయా తిరుగుతున్నాడని తెలిసి మాఫియా డాన్ మండిపడతాడు. ఈ క్రమంలో జరిగిన కలామటీలో ఆ మాఫియా డాన్ రాయ్ చేతులో హతుడవుతాడు. అనుకోని పరిస్థితుల్లో శత్రువుల చేతుల్లో రాయా అక్క గంగ, రాయా ప్రేయసి నాడియా చిక్కుకుంటారు. కడుపులో ఉన్న బిడ్డను చంపుతామని బెదిరించి, నాడియా చేతులతోనే గంగను దండగులు చంపిస్తారు. అక్క చావుకు కారణమైన ప్రియురాలిని రాయ క్షమించాడా? శిక్షించాడా? నాడియా జీవితం ఎలాంటి మలుపు తీసుకున్నది? అక్క కోరిక ప్రకారం రాయా గోవా మాఫియా సామ్రాజ్యానికి అధిపతిగా ఎదిగాడా? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ. కేజీఎఫ'లో ఎలాగైతే నేర ప్రపంచంలో పెరిగి, డాన్‌గా ఎదుగుతాడో.. ఇందులోనూ దాదాపుగా అంతే. అదే ధోరణిలో కథ సాగింది. అందులో అమ్మ సెంటిమెంట్. ఇందులో అక్క సెంటిమెంట్. తప్పు చేసిన ఓ తండ్రి మానసిక వేదనే ఈ సినిమా కథ అని చెప్పొచ్చు. సినిమా ప్రథమార్థం సాధారణ మాఫియా సినిమాలా అనిపించినా, ద్వితీయార్థం మాత్రం కథ కొత్త మలుపు తీసుకుంటుంది. ఆ మలుపుకు సంబంధించిన సంఘర్షణ ఆడియన్‌కి కొత్తగా అనిపిస్తుంది. ఏదేమైనా అసలు కథ కంటే యాక్షన్ అంశాలకే దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్టు అనిపిస్తుంది. ఆద్యంతం నరుక్కోవడాలు, చంపుకోవడాలు, కాల్చుకోవడాలు, మధ్య మధ్య ఇంటిమేటెడ్ సీన్స్. కుటుంబ ప్రేక్షకులకు కలిసి చూసేలా అయితే సినిమా లేదు. యశ్ ఇందులో తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేశాడు. యశ్ అక్క గంగగా నయనతార కథలో ప్రాధాన్యత గల పాత్రను పోషించింది. ఇందులో ఆమె యాక్షన్ సీక్వెన్స్ కూడా అదరగొట్టింది. ఇక కియారా అద్వానీ భావోద్వేగపూరితమైన పాత్ర పోషించింది. చక్కగా అభినయించింది. తారా సుతారియా, రుక్మిణీ వసంత్ పాత్రలు గ్లామర్‌కే పరిమితం అయ్యాయి. చెప్పుకోదగ్గ కథ కాదు. మేకింగ్ మాత్రం బావుంది. గీతూ మోహన్‌దాస్ స్క్రీన్‌ప్లేను అర్థం చేసుకోవడం సగటు ప్రేక్షకుడికి కష్టమే. మొత్తం కథ, కథనం విషయంలో కాస్త జాగ్రత్త తీసుకుంటే బావుండేది. నిర్మాతలు డబ్బులు మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు పెట్టారు. ఖర్చుపెట్టిన ప్రతి పైసా తెరపై కనిపించింది. ఇక రవి బస్రూర్ నేపథ్య సంగీతం బావుంది. కెమెరా వర్క్ కూడా బావుంది. మొత్తంగా సాంకేతికంగా సినిమా బావుంది.

This newspaper is Owned and Published by GUNDEBOINA VENKANNA from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: GUNDEBOINA VENKANNA and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: TGBIL/26/A6717. www.rajyasamskarana.com.